



DD9 వార
తెలుగు దినపత్రిక


కాంగ్రెస్ పార్టీకి పునాది వేసిన సీనియర్ నాయకులకు

## సముచిత గౌరవం ఇవ్వాలి



04

సంపుటి : 02 సంచిక : 277 హైదరాబాద్, మే, గురువారం 07, 2026 పేజీలు : 06 వెల : 3.00

# మెట్రో విస్తరణకు అనుమతివ్వండి

కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
కేంద్ర మంత్రి ఖట్టర్‌తో కీలక సమావేశం
హైదరాబాద్ మెట్రో రెండో దశకు వేగం
డీపీఆర్ ఆమోదం తక్షణం కావాలని విజ్ఞప్తి
కేంద్ర పట్టణాభివృద్ధి శాఖతో సీఎం భేటీ
నగర ట్రాఫిక్ సమస్యలపై ప్రధాన చర్చ
మెట్రోను రాష్ట్ర ఆధీనంలోకి
తీసుకున్న అంశం ప్రస్తావన
శంషాబాద్–ఫ్యూచర్ సిటీ
కారిడార్ ప్రతిపాదన
మెట్రో విస్తరణతో ఆర్థిక అభివృద్ధి ఆశలు
మౌలిక సదుపాయాల
ప్రాజెక్టులపై కేంద్ర సహకారం
వేగవంతమైన
అనుమతుల కోసం సీఎం ఒత్తిడి
సానుకూల
వాతావరణంలో ముగిసిన భేటీ



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు తక్షణ గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నగర రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టును వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రెండో దశకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను వెంటనే ఆమోదించాలని సీఎం కేంద్ర మంత్రికి సూచించారు. అనుమతుల ఆలస్యం లేకుండా ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

**కేంద్ర పట్టణాభివృద్ధి శాఖతో కీలక భేటీ**

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి దాదాపు ..మిగతా 2లో

## మాట తప్పితే రాళ్లతో కొట్టండి

ఉచిత విద్య, వైద్య మా పార్టీ విధానం
ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రి
కావడం మన ఖర్మ
ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని
పట్టించుకోవడం లేదు
ఫీజుల నియంత్రణ
చట్టం ఈ నెలలోనే తేవాలి
టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత




**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆసుపత్రుల్లోనూ పేదలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తామని ఆ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ..మిగతా 2లో

## ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

నా కాన్వాయ్ కోసం ప్రజలను ఆపుతారా?
డీజీపీకి సీఎం రేవంత్ రెడ్డి కీలకమైన ఆదేశాలు
ప్రజలకు ఇబ్బందులు కలిగితే కఠిన చర్యలు
ట్రాఫిక్ నియంత్రణలో మార్పులు అవసరం
ఎయిర్‌పోర్టు పరిసరాల్లో అప్రమత్తత పెంచాలి
సింగిల్ లైన్ విధానంపై దృష్టి పెట్టాలని సూచన
ప్రత్యామ్నాయ మార్గాల సిద్ధతపై ఆదేశాలు
పోలీసు అధికారులకు డీజీపీ మార్గదర్శకాలు
ట్రాఫిక్ సమస్యలపై ముఖ్యమంత్రి ఆగ్రహం
అడిషనల్ డీజీపీ ఆధ్వర్యంలో ట్రాఫిక్ బ్యూరో
విధుల్లో నిర్లక్ష్యానికి తావు ఇవ్వొద్దని కఠిన ఆదేశాలు
ప్రజల ప్రయాణాలకు అంతరాయం వద్దన్న సీఎం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రాష్ట్రంలో ముఖ్యమంత్రి కాన్వాయ్ ప్రయాణాల సమయంలో సాధారణ ప్రజలకు కలిగే ఇబ్బందులపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. ముఖ్యంగా విమానాశ్రయ పరిసర ప్రాంతాల్లో ఇటీవల చోటుచేసుకున్న ట్రాఫిక్ అంతరాయం నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పర్యటనల కారణంగా ప్రజలను గంటల తరబడి రోడ్లపై ..మిగతా 2లో




## రేషన్ షాపుల్లో జొన్న, మొక్కజొన్న

ప్రజలకు పంపిణీ
చేయాలని ప్రభుత్వ ఆలోచన
బహిరంగ వేలానికి చెక్!
పేదలకు పౌష్టికాహారం
మధ్యవర్తుల దందాకు మంగళం
జొన్న, మొక్కజొన్న
రైతులకు అండగా ప్రభుత్వం

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రాష్ట్రంలోని అన్నదాతలకు ప్రభుత్వం భరోసా ఇస్తున్నది. జొన్న, మొక్కజొన్న పంటలకు మద్దతు ధర కల్పించడమే కాకుండా, సేకరించిన ధాన్యాన్ని మార్కెట్ ధర కంటే తక్కువకు రేషన్ దుకాణాల ద్వారా ..మిగతా 2లో

## ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

ధాన్యం కొనుగోళ్లపై
అనవసరం రాద్ధాంతం చేస్తున్నాయి
రాష్ట్రంలో రికార్డ్ స్థాయిలో దిగుబడి
కొనుగోలుపై బీఆర్ఎస్ అసత్య ప్రచారం తగదు
వరుస ఎన్నికల్లో గుణపాఠం
చెప్పినా కనువిప్పు కలుగలేదా?
మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్




**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తాలు పేరుతో కోత విధిస్తే చర్యలు కఠిన చర్యలు ఉంటాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. ధాన్యం కొనుగోళ్లపై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. సచివాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. రైతులను అయోమయంలో పడేసేందుకు ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో రికార్డ్ స్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చిందని వెల్లడించారు. ధాన్యం కొనుగోలు, దిగుబడిలో బీఆర్ఎస్ అసత్య ప్రచారానికి పాల్పడుతున్నదని, శాసన సభ, లోక్‌సభ, సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పినా ఆ పార్టీ నేతలకు కనువిప్పు కలుగ లేదన్నారు. దేశం మొత్తంలోనే రికార్డ్ స్థాయిలో దిగుబడి, కొనుగోళ్లు జరిపింది ..మిగతా 2లో

## రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ మోసం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
వరంగల్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో
రైతు సంగ్రామ సదస్సు నిర్వహణ
సదస్సులో పాల్గొని కాంగ్రెస్‌పై తీవ్ర
స్థాయిలో విరుచుకుపడ్డ కేటీఆర్
రైతు డిక్లరేషన్ పేరుతో నయవంచనకు
పాల్పడిందని ఆరోపణ
కాంగ్రెస్ 34 హామీలు ఇచ్చి ఏవీ అమలు
చేయలేదని వ్యాఖ్య
60 ఏళ్ల పాలనలో రైతులకు నష్టం
జరిగిందని ఘాటు విమర్శ
రైతు మేళా కాదు
దగా మేళా అని కేటీఆర్ వ్యాఖ్య
రైతు బంధు పేరును మార్చే ప్రయత్నాలు
జరుగుతున్నాయని ఆరోపణ
రైతు డబ్బులు రాజకీయ ప్రయోజనాలకు
మళ్లిస్తున్నారని వ్యాఖ్య
ముఖ్యమంత్రి పదవిపై కూడా తీవ్ర
విమర్శలు చేసిన కేటీఆర్
కాంగ్రెస్ పాలనపై రాజకీయంగా
ఎదురుదాడి పెంచిన బీఆర్ఎస్




**హైదరాబాద్, (డిడి9 వార్త):**

వరంగల్ వేదికగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన రైతు సంగ్రామ సదస్సు రాజకీయ వేడిని మరింత పెంచింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పాల్గొని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. రైతు సమస్యలు, హామీల అమలు, సంక్షేమ పథకాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. సదస్సులో మాట్లాడిన కేటీఆర్, రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో రైతులకు 34 హామీలు ఇచ్చినప్పటికీ, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిలో ఒక్కటీ అమలు చేయలేదని ఆయన విమర్శించారు. రైతుల నమ్మకాన్ని దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ వ్యవహరించిందని ఆయన వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ పార్టీ గత ఆరు దశాబ్దాల పాలనలో రైతుల సమస్యలను పట్టించుకోలేదని కేటీఆర్ ఆరోపించారు. రైతుల రక్తం తాగిన ..మిగతా 2లో

## పేదల ఇళ్లను కూల్చడమే హైడ్రా పనా?

నాదర్గుల్‌లో చెరువు కబ్జా
చేస్తుంటే నిద్రపోతుందా?
కాంగ్రెస్ కనుసన్నల్లోనే
'కాసుబాగ్ కంచ' కబ్జా
మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం
ఉన్నతాధికారులకు
ఫోన్ చేసి సమస్య వివరణ
రైతులకు వెంటనే
న్యాయం చేయాలని డిమాండ్

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

హైడ్రా ఉన్నది కేవలం పేదల ఇళ్లను కూల్చడానికేనా అంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు నిలదీశారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం నాదర్గుల్ పరిధిలోని సర్వే నెంబర్ 613 (119) కాసుబాగ్ కంచలో 373 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. దీనిని కబ్జా చేస్తున్న రియల్ ఎస్టేట్ మాఫియా దాడులు, పోలీసుల వేధింపుల నుంచి తమను రక్షించాలని కోరుతూ నాదర్గుల్‌కు ..మిగతా 2లో



## మల్కాజ్‌గిరి సీపీ సుమతి సీక్రెట్ ఆపరేషన్

కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న తొలి రోజే మహిళల భద్రతపై దృష్టి
సగటు మహిళగా మారి బస్టాండ్‌లో స్వయంగా నిల్చున్న సీపీ
అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించిన ఉన్నతాధికారి
సీపీ అని తెలియక చుట్టుముట్టిన కొందరు యువకులు, విద్యార్థులు
సుమారు 40 మంది వరకు చేరి అసభ్య ప్రవర్తన చేసినట్లు సమాచారం
రకరకాల ప్రశ్నలతో ఆమెను అసౌకర్యానికి గురి చేసిన ఘటన
మహిళలు ఎదుర్కొనే సమస్యలను ప్రత్యక్షంగా గమనించిన సీపీ
వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు పరిస్థితిని నియంత్రణలోకి తీసుకున్నారు
అనుచిత ప్రవర్తన చేసిన వారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు




02

## మెట్రో విస్తరణకు అనుమతివ్వండి

**మొదటిపేజీ తరువాయి**

అరగంట పాటు చర్చలు జరిపారు. రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులపై విస్తృతంగా సమీక్ష జరిగింది. హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను తగ్గించడానికి మెట్రో విస్తరణ కీలకమని సీఎం పేర్కొన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం అవసరమని వివరించారు.

**మెట్రో నిర్వహణపై రాష్ట్ర పాత్ర ప్రస్తావన**

హైదరాబాద్ మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకున్న విషయాన్ని సీఎం కేంద్ర మంత్రికి వివరించారు. భవిష్యత్తు విస్తరణలో కేంద్ర సహకారం అవసరమని తెలిపారు. మెట్రో ఫేజ్-3లో భాగంగా శంషాబాద్ విమానాశ్రయం-ఫ్యూచర్ సిటీ కారిడార్ చేపట్టాలని సీఎం ప్రతిపాదించారు. ఇది భవిష్యత్ అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు.

**నగర ఆర్థిక అభివృద్ధికి మెట్రో ప్రాధాన్యం**

మెట్రో విస్తరణ వల్ల పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని సీఎం వివరించారు. నగర ఆర్థిక వ్యవస్థకు ఇది పెద్ద బూస్ట్ ఇస్తుందని చెప్పారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులపై కేంద్ర సహకారం అవసరమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వేగవంతమైన అభివృద్ధికి సమన్వయం కీలకమని చెప్పారు.

**కేంద్ర సహకారంపై ఆశాభావం**

సమావేశంలో ప్రస్తావించిన ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులు ముందుకు సాగుతాయని విశ్వాసం వ్యక్తమైంది. సుమారు అరగంట పాటు జరిగిన ఈ సమావేశం సానుకూలంగా ముగిసింది. రాష్ట్ర ప్రతిపాదనలను పరిశీలిస్తామని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ హామీ ఇచ్చినట్లు సమాచారం.

# ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

**మొదటిపేజీ తరువాయి**

నిలిపేయడం, వాహనాలను పూర్తిగా ఆపేయడం వంటి చర్యలు అనవసరమని స్పష్టం చేశారు. ఈ తరహా చర్యలు ప్రజల్లో అసహనం పెంచుతున్నాయని, ప్రభుత్వ ప్రతిష్ఠకు కూడా భంగం కలిగిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ఇవాళ ఢిల్లీ పర్యటనకు బయలుదేరిన సందర్భంగా విమానాశ్రయం సమీపంలో భారీగా వాహనాలు నిలిచిపోవడం గమనించిన సీఎం వెంటనే స్పందించారు. తన కాన్వాయ్ కోసం సాధారణ ప్రజల పనులకు ఆటంకం కలిగించవద్దని, ముఖ్యంగా ఎదురుగా వస్తున్న వాహనాలను కూడా పూర్తిగా నిలిపివేయడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో సమతుల్యత అవసరమని, ప్రజల ప్రయాణాలు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పోలీసు విభాగానికి కీలక ఆదేశాలు జారీ అయ్యాయి. డీజీపీ సీవీ ఆనంద్‌కు సీఎం నేరుగా సూచనలు ఇస్తూ, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయడం వంటి చర్యలను ఇకపై సహించబోమని స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు డీజీపీ సీవీ ఆనంద్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీసు కమిషనర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ నిర్వహణపై సమగ్రంగా చర్చించారు. ట్రాఫిక్ సమస్యపై ముఖ్యమంత్రి పదేపదే స్పందించాల్సి రావడం సమస్య తీవ్రతను సూచిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు.

ట్రాఫిక్ నియంత్రణలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని డీజీపీ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణను పటిష్ఠం చేసేందుకు అడిషనల్ డీజీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక ట్రాఫిక్ బ్యూరో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన విధివిధానాలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. ట్రాఫిక్ నిర్వహణలో ఆధునిక సాంకేతికత వినియోగం, సమన్వయం, ఫీల్డ్ స్థాయిలో సమర్థవంతమైన అమలు కీలకమని అన్నారు.

సీఎం కాన్వాయ్ ప్రయాణాల సమయంలో ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయకుండా, సింగిల్ లైన్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. అంటే ఒక వైపు కాన్వాయ్‌కు ప్రాధాన్యం ఇస్తూనే, మరో వైపు సాధారణ వాహనాలను నియంత్రితంగా కదిలించేలా ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా ప్రజలకు కలిగే ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని అధికారులు భావిస్తున్నారు.

అలాగే వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ముందుగానే ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించి, వాటిపై స్పష్టమైన సూచనలు ఇవ్వాలని డీజీపీ ఆదేశించారు. ట్రాఫిక్ మళ్లింపులపై ముందస్తు సమాచారం ఇవ్వడం ద్వారా ప్రజలు తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా నగర ప్రాంతాల్లో పీక్ అవర్స్‌లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

విమానాశ్రయ పరిసర ప్రాంతాల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. అక్కడ ట్రాఫిక్ ఒత్తిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాన్వాయ్ కదలికల సమయంలో అత్యవసర సేవలు, అంబులెన్స్‌లు, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిర్వహణ చేయాలని స్పష్టం చేశారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. ట్రాఫిక్ నిర్వహణలో చిన్న పొరపాట్లు కూడా పెద్ద సమస్యలకు దారితీసే అవకాశముందని, అందువల్ల ప్రతి స్థాయిలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మొత్తంగా ప్రజల ప్రయాణాలకు అంతరాయం కలగకుండా చూసే దిశగా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది. సీఎం కాన్వాయ్ ప్రయాణాలు ప్రజలకు భారంగా కాకుండా, సౌకర్యంగా ఉండేలా మార్పులు తీసుకురావాలని స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చారు. దీంతో భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు తగ్గి, ప్రజలకు ఉపశమనం లభించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.



## మాట తప్పితే రాళ్లతో కొట్టండి

**మొదటిపేజీ తరువాయి**

మరోసారి తేల్చి చెప్పారు. తాను ఇచ్చిన మాటను తప్పితే అమరుల స్థూపం స్తంభానికి కట్టేసి రాళ్లతో కొట్టాలన్నారు. హైదరాబాద్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాణ్యమైన విద్యఫీజుల నియంత్రణ అనే అంశంపై సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్య, వైద్యం కోసమే తెలంగాణలో ప్రతీ కుటుంబం 70 శాతం ఖర్చు చేసే పరిస్థితి ఉన్నదని అన్నారు. 1,200 మంది ప్రాణ త్యాగం చేసి.. ఎంతో మంది విద్యార్థులు లాఠీ దెబ్బలు తిని రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. సాధించుకున్న తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఒక సంవేదనతో పాలన చేయాల్సి ఉండేనని చెప్పారు. కానీ.. ఆ పని జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు నియంత్రణ కోసం తిరుపతిరావు కమిషన్ వేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఆ కమిషన్ ఇచ్చిన రిపోర్ట్‌పై ఒక్క అడుగు ముందుకు వేయలేదన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యం అందించడాన్ని ఒక సామాజిక బాధ్యతగా భావిస్తే వాటిని ఉచితంగా అందించడం సాధ్యమేనని చెప్పారు. కానీ.. ప్రస్తుత ప్రభుత్వం ఆ బాధ్యత నుండి తప్పుకుని ప్రజలను వారి కర్మకు వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టటంలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఘోరంగా విఫలమైందన్నారు. ఫీజుల దోపిడీ నియంత్రణకు ఈ నెలలోనే చట్టం తేవాలని డిమాండ్ చేశారు.

అలాగే.. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో అవినీతిపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని తుంగలో తొక్కే కుట్రలను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని నియంత్రించాల్సిన ముఖ్యమంత్రే ప్రైవేట్ విద్య సంస్థల ప్రారంభోత్సవాలకు వెళ్తూ వారిని ఎంకరేజ్ చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రే మన విద్యాశాఖ మంత్రి కావటం ఖర్మ అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని హెచ్చరించారు. త్వరలోనే తమతో కలిసి వచ్చే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేస్తామని చెప్పారు. ప్రభుత్వం కొత్తగా తెచ్చిన జీవో 7తో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు మంగళం పాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఆ జీవోను వెంటనే రద్దు చేయాలని.. పెండింగ్‌లో ఉన్న రూ.11,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే.. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో అడ్డగోలు అవినీతి జరుగుతున్నదని కవిత ఆరోపించారు. ఈ అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో కొనసాగుతున్న హెచ్‌పీఎస్ ఈ ఏడాది 120 శాతం ఫీజు పెంచిందని అన్నారు. ప్రభుత్వ స్థలంలో కొనసాగే స్కూల్లోనే ఈ పరిస్థితి ఉంటే.. కార్పొరేట్ స్కూళ్లలో పరిస్థితి ఎలా ఉంటుందని ప్రశ్నించారు. దీనికితోడు ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితులైన కొందరు ఏకంగా 30 ఎకరాల క్యాంపస్ భూమిని కబ్జా చేసే పనిలో ఉన్నారని ఆరోపించారు. హెచ్‌పీఎస్ పనితీరుపై సమగ్ర సమీక్ష జరిపి, తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మల్కాజ్‌గిరి సీపీ సుమతి సీక్రెట్ ఆపరేషన్

- **కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న తొలి రోజే మహిళల భద్రతపై దృష్టి**
- **సగటు మహిళగా మారి బస్టాండ్‌లో స్వయంగా నిల్చున్న సీపీ**
- **అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించిన ఉన్నతాధికారి**
- **సీపీ అని తెలియక చుట్టుముట్టిన కొందరు యువకులు, విద్యార్థులు**
- **సుమారు 40 మంది వరకు చేరి అసభ్య ప్రవర్తన చేసినట్లు సమాచారం**
- **రకరకాల ప్రశ్నలతో ఆమెను అసౌకర్యానికి గురి చేసిన ఘటన**
- **మహిళలు ఎదుర్కొనే సమస్యలను ప్రత్యక్షంగా గమనించిన సీపీ**
- **వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు పరిస్థితిని నియంత్రణలోకి తీసుకున్నారు**
- **అనుచిత ప్రవర్తన చేసిన వారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు**




**హైదరాబాద్, (డిడి9 వార్త):**

మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తొలి రోజే సుమతి అర్ధరాత్రి సమయంలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. మహిళల భద్రతపై ప్రత్యక్ష అవగాహన కోసం ఆమె సగటు మహిళలా మారి బస్టాండ్‌లో స్వయంగా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో నిల్చున్నది కమిషనర్ అన్న విషయం తెలియక కొందరు యువకులు, విద్యార్థులు ఆమెను చుట్టుముట్టినట్లు సమాచారం. సుమారు 40 మంది వరకు చేరి రకరకాల ప్రశ్నలు అడుగుతూ అసౌకర్యానికి గురి చేసినట్టు తెలుస్తోంది. ఈ పరిస్థితిని ముందుగానే అంచనా వేసి అక్కడే ఉన్న పోలీసులు వెంటనే స్పందించారు. ఆ యువకులను అక్కడి నుంచి అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. మహిళల భద్రతపై ఉన్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికే ఈ విధంగా ఫీల్డ్‌లోకి వెళ్లినట్లు పోలీస్ వర్గాలు చెబుతున్నాయి.

## ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

**మొదటిపేజీ తరువాయి**



తెలంగాణలోనే అన్నారు. ఈ రబీ సీజన్‌లో 67 లక్షల ఎకరాలలో వరి సాగు, 141 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానున్నదన్నారు. 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉన్నదని, ఇప్పటి వరకు ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం 17.28 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి గాను రైతులకు ఇప్పటి వరకు రూ.2,310 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. రబీలో ధాన్యం కొనుగోలుకు గాను 21 వేల కోట్ల కేటాయింపులు చేశామని తెలిపారు. అకాల వర్షాలు సంభవిస్తే ధాన్యం తడిసి పోకుండా ఉండేందుకు 2.63 లక్షల టార్పాలిన్లను అందుబాటులో ఉంచామని, రాష్ట్ర వ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, 18.75 కోట్ల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచామని ఉత్తమ్ వివరించారు. 64.83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే సామర్థ్యం గల గోదాములు ఏర్పాటు చేశామని, అదనంగా 11.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసేందుకు గోదాములు గుర్తించినట్లు వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేందుకు 6,200 వాహనాల ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల్లో తాగు నీరు, ఓఆర్ఎస్ సరఫరా చేస్తున్నామని, రైతులు చనిపోతే తక్షణమే పరిహారం ఇస్తున్నామని వెల్లడించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎప్పటికప్పుడు రాష్ట్ర స్థాయి నోడల్ అధికారి పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. అన్నింటికీ మించి కొనుగోలు అంశంపై ప్రత్యేకించి పౌర సరఫరాల శాఖ కేంద్ర కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిరీక్షించకుండా ప్రత్యేక టోకెన్లు ఇస్తున్నామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2023 24 రబీలో 7,178 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 7 లక్షల 62 వేల మంది రైతుల నుంచి 47.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.10,549 కోట్లు రైతులకు చెల్లించామన్నారు. 2024 25 రబీలో 8,378 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 10 లక్షల 87 వేల మంది రైతుల నుంచి 74.21 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.17,198 కోట్లు చెల్లించామని, 2025 26 ఖరీఫ్ 8,448 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 11లక్షల 65వేల మంది రైతుల నుండి 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.17,160 కోట్లు చెల్లించినట్లు వివరించారు. ప్రస్తుత రబీలో 8,575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 13 లక్షల మంది రైతుల నుంచి రికార్డ్ స్థాయిలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు లక్ష్యాన్ని పెట్టుకుని రూ.21,501 కోట్లు రైతులకు చెల్లించేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉన్నదన్నారు. తప్పుడు సమాచారంతో రైతాంగాన్ని గందరగోళంలోకి నెట్టవద్దని విపక్షాలకు విజ్ఞప్తి చేశారు. ఇది రైతు ప్రభుత్వం, వారికి నష్టం కలిగించే ఏ చర్యను కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థించదని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

## పేదల ఇళ్లను కూల్చడమే హైడ్రా పనా?

**మొదటిపేజీ తరువాయి**

చెందిన రైతులు బుధవారం హైదరాబాద్‌లో హరీశ్ రావును కలిశారు. కబ్జాదారులు వేసిన కంచెలు, ధ్వంసమైన తమ వ్యవసాయ బోర్లు, దాడుల్లో గాయపడిన ఫొటోలు, వీడియోలను చూపి తమ గోసను వెళ్లబోసుకున్నారు. తక్షణమే ఉన్నతాధికారులకు ఫోన్ చేసిన హరీశ్ రావు, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నాదర్గుల్ భూములు అన్యాక్రాంతం కాకుండా గతంలో కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ల్యాండ్ సీలింగ్ యాక్ట్ కింద హైకోర్టు వరకు న్యాయపోరాటం చేసిందన్నారు. ఆ భూములు ప్రభుత్వానివే అని ప్రస్తుత ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసిందని చెప్పారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల అండదండలతోనే ప్రైవేట్ వ్యక్తులకు ఈ భూములను ధారాదత్తం చేసే కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు.

**ఉన్నతాధికారులకు ఫోన్లు**

ప్రభుత్వ భూములు, చెరువుల రక్షణ కోసమే హైడ్రా తీసుకొచ్చామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం, నాదర్గుల్‌లోని వేల కోట్ల ప్రభుత్వ భూమి, అందులోని చెరువును రియల్ ఎస్టేట్ రాబందులు కబ్జా చేస్తుంటే ఎందుకు నిద్రపోతున్నదని హరీశ్ రావు ప్రశ్నించారు. ప్రభుత్వ పెద్దల అండదండలతో ప్రభుత్వ భూములను, అందులోని చెరువులను, ఫీడర్ ఛానల్‌ను ధ్వంసం చేస్తూ కంచెలు వేసి కబ్జా చేస్తున్న బడా రియల్ ఎస్టేట్ సంస్థల వైపు కన్నెత్తి చూసే దమ్ము హైడ్రాకు ఉందా అని ధ్వజమెత్తారు. రైతులకు న్యాయం జరగని పక్షంలో తానే స్వయంగా బీఆర్ఎస్ పార్టీ బృందంతో నాదర్గుల్ భూములను సందర్శిస్తానని స్పష్టం చేశారు. హరీశ్ రావు రిక్వెస్ట్ మేరకు కలెక్టర్, సీపీ, ఇతర ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని, రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ పేద రైతుల పక్షానే నిలబడుతుందని, న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని హరీశ్ రావు రైతులకు భరోసా ఇచ్చారు.

**హరీశ్ వల్లే సాధ్యం**

హరీశ్ రావు వస్తేనే తమకు న్యాయం జరుగుతుందని రైతులు పేర్కొన్నారు. తమ సమస్య పరిష్కారం బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని, భూములను సందర్శించి తమకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. దాదాపు 70 ఏళ్లుగా శిస్తు చెల్లిస్తూ సాగు చేసుకుంటున్నామని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద బ్యాంకుల నుంచి రుణాలు తెచ్చుకుని బోర్లు, బావులు తవ్వుకుని వ్యవసాయం చేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ, పోలీసు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులో చేపలు పట్టుకోనివ్వకుండా, గుడికి వెళ్లకుండా దాడులు చేస్తున్నారని కన్నీరు పెట్టుకున్నారు.

## రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ మోసం

**మొదటిపేజీ తరువాయి**



పార్టీగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోయిందని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చే హామీలు కేవలం ఓట్ల కోసం మాత్రమేనని, వాటి అమలు విషయంలో మాత్రం కాంగ్రెస్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. రైతు డిక్లరేషన్ పేరుతో విడుదల చేసిన పత్రాన్ని "బోగస్ డాక్యుమెంట్"గా ఆయన అభివర్ణించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే వాటిని ఉపయోగించారని ఆరోపించారు. రైతుల జీవితాలతో రాజకీయాలు చేయడం సరైంది కాదని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ ఇటీవల నిర్వహించిన రైతు మేళాపైనా ఆయన విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ రైతు సంగ్రామ సభ నిర్వహిస్తే, కాంగ్రెస్ ప్రతిస్పందనగా రైతు మేళా పెట్టిందని, అయితే అది నిజానికి "దగా మేళా"గా మారిందని వ్యాఖ్యానించారు. రైతుల సమస్యలను పరిష్కరించడం కాకుండా, కేవలం ప్రచార కార్యక్రమాలకే పరిమితమయ్యిందని ఆయన విమర్శించారు.

రైతు బంధు పథకం విషయంలో కూడా కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేసీఆర్ హయాంలో ప్రవేశపెట్టిన రైతు బంధు పథకాన్ని బలహీనపరచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. కొన్ని చోట్ల ఆ పథకాన్ని నిలిపివేసే లేదా పేర్లు మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రైతులకు రావాల్సిన నిధులు ఇతర రాజకీయ అవసరాలకు మళ్లిస్తున్నారని కూడా ఆయన వ్యాఖ్యానించారు.

"ఎ. రేవంత్ రెడ్డి అంటే ఎగవేతల రేవంత్ రెడ్డి" అని వ్యాఖ్యానించిన కేటీఆర్, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని అన్నారు. రుణమాఫీ సహా అనేక సంక్షేమ పథకాలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయని ఆరోపించారు.

సదస్సులో ఆయన ఒక కీలక సవాల్ కూడా విసిరారు. రాష్ట్రంలోని ఏ గ్రామానికైనా వెళ్లి పూర్తి రుణమాఫీ జరిగిందని రైతులు చెబితే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించారు. ఈ ఛాలెంజ్‌ను సీఎం రేవంత్ రెడ్డి లేదా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వీకరించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల పరిస్థితి వాస్తవానికి భిన్నంగా ఉందని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ గణాంకాలు ఒకలా చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన వ్యాఖ్యానించారు. పంటలకు సరైన ధరలు లేకపోవడం, ఇన్‌పుట్ సబ్సిడీలు ఆలస్యం కావడం, రుణభారం పెరగడం వంటి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అంతేకాకుండా, బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో తీసుకువచ్చిన రైతు సంక్షేమ పథకాలను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని కేటీఆర్ అన్నారు. రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందాయని గుర్తు చేశారు. ప్రస్తుతం వాటిని బలహీనపరచడం సరైన విధానం కాదని ఆయన వ్యాఖ్యానించారు. సదస్సు మొత్తం కేటీఆర్ ప్రసంగం కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజకీయ దాడిగా మారింది. రైతుల సమస్యలను పరిష్కరించకుండా రాజకీయ ప్రచారాలపై దృష్టి పెట్టడం సరికాదని ఆయన హెచ్చరించారు. రైతుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. వరంగల్ సదస్సు ముగిసిన అనంతరం బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం కనిపించగా, రాజకీయ వర్గాల్లో ఈ వ్యాఖ్యలు కొత్త చర్చకు దారి తీసాయి. రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాలు మరింత వేడెక్కే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## రేషన్ షాపుల్లో జొన్న, మొక్కజొన్న

**మొదటిపేజీ తరువాయి**

నేరుగా పేదల చెంతకు చేర్చేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ఈ పంటలను బహిరంగ మార్కెట్‌లో వేలం వేసి మధ్యవర్తులకు లాభం చేకూర్చకుండా, సివిల్ సప్లై శాఖ ద్వారా రేషన్ షాపులలో పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నది. త్వరలోనే అధికారికంగా ప్రకటించి అందుబాటులోకి తీసుకురాబోతున్నది.

**మార్కెట్ ధర కంటే తక్కువకే..**

పంట పండించిన రైతు నష్టపోకూడదనే ఉద్దేశంతో జొన్న, మొక్కజొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నది. ఇటీవల జరిగిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. మార్కెట్ ధర కంటే తక్కువకే ప్రజలకు పౌష్టికాహారాన్ని అందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. త్వరలోనే కిలో ధర సైతం నిర్ణయించనున్నారు.

**దోపిడీకి అడ్డుకట్ట వేస్తూ..**


సాధారణంగా సేకరించిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో ప్రభుత్వం వేలం వేస్తుంది. దీన్ని అదునుగా తీసుకుని మధ్యవర్తులు తక్కువ ధరకే దక్కించుకుని లాభపడుతుంటారు. ఈ దోపిడీకి అడ్డుకట్ట వేస్తూ, సేకరించిన ధాన్యాన్ని ప్యాకింగ్ చేయించి నేరుగా ప్రజలకు తక్కువ ధరకు పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. "ధాన్యం కేవలం మార్కెట్ సరుకుగా మిగిలిపోకూడదు. అది పేదవాడి ఆకలి తీర్చి, పౌష్టికాహారంగా మారాలి" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.

**విద్యార్థులకు కూడా లాభమే**

ప్రభుత్వ నిర్ణయం వల్ల కేవలం సామాన్య ప్రజలకే కాకుండా, సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే వేలాది మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనున్నది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించేలా జొన్న, మొక్కజొన్నల సరఫరాకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. అలాగే సంక్షోభంలో ఉన్న పౌల్ట్రీ రంగాన్ని ఆదుకునేందుకు మార్కెట్ ధర కంటే తక్కువకు పౌల్ట్రీ రైతులకు అవసరమైన మేరకు కూడా సరఫరా చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నది. సర్కారు తీసుకున్న ఈ వినూత్న నిర్ణయం పట్ల రైతులు, సామాన్య ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# దొడ్డు వడ్లను వెంటనే కొనుగోలు చేయాలి

- **బీజేపీ నేత డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి డిమాండ్**



**నిజామాబాద్ జిల్లా, మే 06 (డీడీ9 వార్త) :**

బాల్కొండ నియోజకవర్గంలోని వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వెంటనే దొడ్డు వడ్ల సేకరణ చేపట్టాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం భీంగల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసే సమయంలో క్వింటాకు 7 నుంచి 10 కిలోల వరకు కోత విధిస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎలాంటి కడత లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వారం రోజుల్లోగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయకపోతే అధికార పార్టీ నాయకులను గ్రామాల్లో తిరగనివ్వబోమని స్పష్టం చేశారు. రైతులు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా స్థానిక ఎమ్మెల్యే ఎక్కడా కనిపించకపోవడం శోచనీయమని, నియోజకవర్గ ప్రజలను గాలికి వదిలేశారని ఎద్దేవా చేశారు. అనంతరం ఈనెల 10వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ చారిత్రాత్మక సభకు బాల్కొండ నియోజకవర్గం నుండి బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మోహన్ రెడ్డి, భీంగల్ మండల అధ్యక్షుడు అరే రవీందర్, కుప్కల్ సర్పంచ్ నర్సింగరావు, జిల్లా కార్యదర్శి నోముల నర్సారెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు స్టేట్ కౌన్సిల్ మెంబర్ యోగేశ్వర నరసయ్య, సీనియర్ నాయకులు బండారి లక్ష్మణ్ గౌడ్, కొండ రామా గౌడ్, తోట గంగాధర్, నీలం గంగాధర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



# లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు

- **జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.రాజశ్రీ హెచ్చరిక**

**నిజామాబాద్ జిల్లా, మే 06 (డీడీ9 వార్త) :**

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. రాజశ్రీ హెచ్చరించారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పి.సి.పి.ఎన్.డి.టి చట్టం జిల్లా స్థాయి సలహా సంఘ సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి స్కానింగ్ కేంద్రం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, కేవలం అర్హత కలిగిన రేడియాలజిస్టులు, గైనకాలజిస్టులు, కార్డియాలజిస్టులు మరియు ఆప్తమాలజిస్టులు మాత్రమే స్కానింగ్ నిర్వహించాలని స్పష్టం చేశారు. చట్టం ప్రకారం నమోదు చేసుకున్న వైద్యులు మాత్రమే స్కానింగ్ యంత్రాలను వాడాలని, నిబంధనలకు విరుద్ధంగా గర్భిణీ స్త్రీలకు పరీక్షలు నిర్వహించరాదని ఆదేశించారు. కొత్తగా స్కానింగ్ యంత్రాలను కొనుగోలు చేయాలనుకునే వైద్యులు ముందుగా జిల్లా వైద్యాధికారి కార్యాలయం నుండి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవడం తప్పనిసరి అని ఆమె పేర్కొన్నారు. యంత్రం వచ్చిన తర్వాత ఫార్మ్ బి సర్టిఫికెట్‌లో యంత్రం మరియు దానిని ఉపయోగించే వైద్యుని వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. స్కానింగ్ నిర్వహించిన తర్వాత పుట్టబోయే బిడ్డ లింగం గురించి ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించకూడదని, ఒకవేళ నిబంధనలు అతిక్రమించి లింగ నిర్ధారణ చేసి గర్భ విచ్ఛిత్తికి పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి కేంద్రంలో వైద్యుల సమయపాలన వివరాలను తెలిపే చార్టును తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం మొత్తం 131 స్కానింగ్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, అందులో నిజామాబాద్ డివిజన్‌లో 87, ఆర్మూర్ డివిజన్‌లో 30, బోధన్ డివిజన్‌లో 14 కేంద్రాలు పనిచేస్తున్నాయని వెల్లడించారు. గత మూడు నెలల కాలంలోనే జిల్లావ్యాప్తంగా 96 కేంద్రాలను తనిఖీ చేశామని, తనిఖీ బృందాలకు ముందస్తు సమాచారం లేకుండా ఏ సమయంలోనైనా తనిఖీ చేసే అధికారం ఉందని గుర్తు చేశారు. ప్రతి స్కానింగ్‌కు వైద్యుడి సిఫారసు పత్రం అవసరమని, ఫామ్ ఎఫ్ పైన గర్భిణీ స్త్రీ పేరు, వయస్సు, చివరిసారి రుతుస్రావం అయిన తేదీ వంటి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. సమాజంలో స్త్రీ పురుషుల నిష్పత్తి పడిపోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఆడ మగ అనే తేడా లేకుండా అందరినీ సమానంగా చూడాలని ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు ప్రోగ్రాం అధికారులు, ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తక్షణం కారేగాం ఇసుక క్వారీని నిలిపివేయాలని గ్రామస్తుల డిమాండ్

**నిజామాబాద్ పోతంగల్ మే 06(డిడి9 వార్త)**

నిజామాబాద్ జిల్లా కారేగాం గ్రామం నందు బుధవారం రోజున ఇసుక నిర్వాహకులకు బంగారు బాతు గుడ్డుగా మారిన మంజీరా నది నిబంధనలు తుంగలో తొక్కి అక్రమంగా తవ్వకాలు అన్నదాతలు తమ పంటలకు సాగునీరు అందక పొలాలు ఎడారుగా మారే పరిస్థితి నెలకొంది అయినప్పటికీ ప్రభుత్వానికి ఆదాయం కోసం రైతుల పొట్ట కొడుతున్నారు కొంతమంది నేతలు ఇసుక మాఫియాలో కొంతమంది నేతలు ఇసుక మాఫియాలో ఆరితేరిన వ్యక్తులు ఈ అక్రమ దందా కొనసాగిస్తున్నారు విచ్చలవిడిగా ఇసుక దందా కొనసాగించి కోట్లు దండుకున్నారు ఇప్పుడు ఇదే మాఫియా కారేగాం మంజీర నది పై పద్దారు నెలరోజులుగా ఖనిజ అభివృద్ధి సమస్త ఆధ్వర్యంలో కారేగాం మంజీర నదిలో ఇసుక క్వారీ కొనసాగుతుంది ఈ క్వారీలో ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు తవ్వకాలు రవాణా కొనసాగాలి మంజీరా నదిలోఇసుక తవ్వకాలు జరపకూడదని నిబంధనలు ఉన్నాయని కొంత మంది జేబులు పగలు రాత్రి అనే తేడా లేకుండా ఇసుక దోపిడీ కొనసాగుతోంది ఇది ఇలా ఉంటే బాన్సువాడ మొదలు కొని సాలూరా వరకు మంజీర నది పర్యాయక ప్రాంతాలో 50 వేల ఎకరాల భూమి సాగు ఉంది వీటిలో మంజీర నదిలో బోర్లు వేసుకొని కొంతమంది పంటలు పండించుకుంటున్నారు మరి కొందరు ఎత్తిపోతల పథకాల కింద పంటలు సాగు చేసుకుంటున్నారు మరికొన్ని చోట్ల మంచినీటి సౌకర్యం కోసం బోర్లు వేశారు చాలా సంవత్సరాల నుండి కారేగాం గ్రామం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 20 గ్రామాలకు తాగునీటి సరఫరా సౌకర్యం ఉంది గనుక ఈ వానకాలం ఆశించిన రీతిలో వర్షాలు పడకుంటే రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారే పరిస్థితి నెలకొంది రైతులు గ్రామస్తులు ఉద్యమం చేస్తేనే తప్ప కారేగాం ఇసుక క్వారీ ఆగే పరిస్థితి లేకుండా పోయింది ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ నరహరి సునీల్ మాట్లాడుతూ తక్షణమే ఇసుక క్వారీ నిలిపి వేయాలని లేదంటే ఉద్యమం చేపడతాం అని చెప్పారు కారేగాం క్వారీలో హంగర్గా వేబీలతో లోడింగ్ జరుగుతున్నవి మహారాష్ట్ర నుండి కొన్ని వాహనాలు వచ్చి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ సునీల్ , బి రాం పాటెల్ ,శాఖమూరి సాంబశివరావు, అశోక్ పటేల్, గజేందర్ పటేల్,ఉప సర్పంచ్ పందిరి సతీష్, భద్ర బోయి, దొంతుల శంకర్, సాయిలు, ఎర్రోళ్ల హరిదాస్, ఎర్రోళ్ల సాయిలు, నరహరి విట్టల్, రాం చందర్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు





# నగరవాసులకు చేరువగా నాగార్జున డెయిరీ ఉత్పత్తులు

**నిజామాబాద్ జిల్లా, మే 06 (డీడీ9 వార్త) :**

పాడి పరిశ్రమ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన నాగార్జున డెయిరీ, నిజామాబాద్ నగర ప్రజలకు మరింత చేరువైంది. నగరంలోని రైతు బజారులో ఏర్పాటు చేసిన నూతన నాగార్జున మిల్క్ పార్లర్‌ను బుధవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తా ఘనంగా ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి పార్లర్‌ను ప్రారంభించిన అనంతరం వారు జ్యోతి ప్రజ్వలన గావించి, అక్కడ అందుబాటులో ఉన్న వివిధ రకాల పాడి ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి కీలకమైన పాలు, పెరుగు మరియు ఇతర అనుబంధ ఉత్పత్తులను నాణ్యంగా అందించడంలో నాగార్జున డెయిరీ ఎప్పుడూ ముందుంటుందని కొనియాడారు. స్థానికంగా ఇలాంటి పార్లర్లు ఏర్పాటు చేయడం వల్ల నగరవాసులకు స్వచ్ఛమైన ఆహార పదార్థాలు అందుబాటులోకి వస్తాయని ఆయన ఆకాంక్షించారు. నాగార్జున డెయిరీ సీఈఓ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ వినియోగదారుల సంతృప్తియే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గత రెండు దశాబ్దాలుగా లక్షలాది కుటుంబాల నమ్మకాన్ని గెలుచుకున్న నాగార్జున బ్రాండ్, ఇప్పుడు నిజామాబాద్ నగరంలో తన సేవలను మరింత విస్తృతం చేయడం సంతోషంగా ఉందన్నారు. పల్లెటూరి స్వచ్ఛతను ఆధునిక సాంకేతికతతో జోడించి ప్రతి ఇంటికి ఆరోగ్యాన్ని చేరవేయడమే తమ సంకల్పమని వివరించారు. ఈ పార్లర్‌లో పాలు, పెరుగు, నెయ్యి, పనీర్ వంటి అన్ని రకాల డెయిరీ ఉత్పత్తులు నిరంతరం అందుబాటులో ఉంటాయని తెలిపారు. సేల్స్ మేనేజర్ పరశురాం మాట్లాడుతూ నగర ప్రజలకు తాజా ఉత్పత్తులను సరఫరా చేస్తామని, ఇక్కడ హోల్ సేల్ మరియు రీటైల్ సేవలు కూడా లభిస్తాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డెయిరీ ప్రతినిధులు, వినియోగదారులు పాల్గొన్నారు.






# వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

**నిజామాబాద్ జిల్లా, మే 06 (డీడీ9 వార్త) :**

తీవ్రమైన ఎండలు, వడగాల్పుల నేపథ్యంలో చిన్నపిల్లలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఆరోగ్య విద్య బోధకులు డి.హెచ్.ఈ ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నగరంలోని గంగస్థాన్ ఫేస్2 లో గల రామకృష్ణ మఠంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరానికి హాజరైన విద్యార్థులకు వడదెబ్బ నివారణా చర్యలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు మరియు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉందని, అందుకే ఉదయం 11 గంటల లోపు లేదా సాయంత్రం 5 గంటల తర్వాతే బయటకు రావాలని కోరారు. మధ్యాహ్నం వేళల్లో తీవ్రమైన ఎండలు ఉండే అవకాశం ఉన్నందున విద్యార్థులు బహిరంగ ప్రదేశాల్లో ఆడుకోకూడదని, అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తలకు టోపీ లేదా గొడుగు వాడాలని, ఒంటి నిండా బట్టలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. వేసవిలో దాహం వేసినా వేయకపోయినా ప్రతి అరగంటకు ఒకసారి నీరు తాగడం అలవాటు చేసుకోవాలని, శీతల పానీయాలు, ఫ్రిజ్ నీళ్లకు దూరంగా ఉండి కుండలోని నీటిని మాత్రమే తాగాలని ఆయన పేర్కొన్నారు. మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు మరియు ఓ.ఆర్.ఎస్ ద్రావణాన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని తెలిపారు. రోడ్ల పక్కన అమ్మే తినుబండారాలు, పిజ్జాలు, బర్గర్ల వంటి జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు హితవు పలికారు. ఈ అవగాహన సదస్సులో కేవలం వడదెబ్బ గురించే కాకుండా రక్తహీనత నివారణ, పోషకాహారం తీసుకోవడం, చేతుల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలపై కూడా వివరించారు. పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలు, జీవనశైలి మార్పులు మరియు మానసిక ఒత్తిడిని ఎలా అధిగమించాలో విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ కుమార్, ప్రసాద్‌తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.





# రైతులు ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**నిజామాబాద్ జిల్లా, మే 06 (డీడీ9 వార్త) :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాలు బుధవారం కమ్మర్‌పల్లిలో ఉత్సాహంగా సాగాయి. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో 'బ్యాంకులు, ఎఫ్‌పీఓలు, వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా రైతులకు అందుతున్న సేవలు' అనే అంశంపై రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య మాట్లాడుతూ... రైతులను అన్ని రంగాల్లో చైతన్యవంతులను చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రగతి ప్రణాళికను చేపట్టిందని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతి రైతు అవగాహన పెంచుకోవాలని ఆయన కోరారు. సదస్సులో మార్కెట్ కమిటీ కార్యదర్శి రాజు మాట్లాడుతూ, మార్కెటింగ్ శాఖ ద్వారా రైతులకు అందుతున్న పథకాలు మరియు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కల్పిస్తున్న యంత్ర పరికరాల సౌకర్యాలను వివరించారు. ఎన్డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, నిజామాబాద్ సహకార బ్యాంకు ద్వారా రైతులకు తక్కువ వడ్డీకే అందిస్తున్న రుణ సదుపాయాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారిణి రమ్యశ్రీ ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న వరి రకాల గురించి రైతులకు వివరించారు. అలాగే ఎంపీడీఓ రాజశ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఉపయోగపడే పనుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, డైరెక్టర్ నవీద్, ఏఈఓలు, బ్యాంకర్లు, ఉద్యానవన శాఖ అధికారులు , రైతులు పాల్గొన్నారు.



# సంఘ భవనాల ప్రహరీ గోడల నిర్మాణానికి భూమి పూజ

**నిజామాబాద్ జిల్లా, మే 06 (డీడీ9 వార్త) :**

కమ్మర్‌పల్లి మండలంలోని హాస కొత్తూరు గ్రామంలో వివిధ కుల సంఘాల భవనాలకు ప్రహరీ గోడల నిర్మాణ పనులను సర్పంచ్ నలిమేళా రేవతి గంగారెడ్డి ఘనంగా ప్రారంభించారు. మాజీ రాజ్యసభ సభ్యులు కె.ఆర్. సురేష్ రెడ్డి సహకారంతో మంజూరైన నిధులతో ఈ అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల్లోని అన్ని వర్గాల సంక్షేమానికి, సంఘ భవనాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా నవయువ సంఘానికి రూ. 3 లక్షలు, గౌడ సంఘానికి రూ. 3 లక్షలు, లంబాడి సంఘానికి రూ. 5 లక్షలు మరియు నాయకపోడు సంఘానికి (భీమన్న గుడి వద్ద) రూ. 5 లక్షల నిధులతో ప్రహరీ గోడల నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. తమ సంఘాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించినందుకు ఆయా సంఘాల సభ్యులు మాజీ ఎంపీ సురేష్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామంలోని ప్రభుత్వ మరియు సామాజిక ఆస్తుల రక్షణకు ఈ ప్రహరీ గోడల నిర్మాణం ఎంతో దోహదపడుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఏనుగు మనోహర్, వార్డు సభ్యులు కుందేటి శ్రీనివాస్, పెద్ది సృజాన్, కనుక నర్సయ్య, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు. వీరితో పాటు పెద్ది గంగాధర్, పెద్ది నారాయణ, మండపల్లి మహేందర్, వేంపల్లి దశగౌడ్ మరియు ఆయా సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# క్యాన్సర్ బాధితురాలికి 'మిత్రమా' అండ

- **రూ.82,600 విరాళం అందజేత**

**నిజామాబాద్ జిల్లా, మే 06 (డీడీ9 వార్త) :**

క్యాన్సర్‌తో పోరాడుతున్న ఓ నిరుపేద మహిళకు వేల్పూర్‌కు చెందిన 'మిత్రమా ఫౌండేషన్' సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. భీంగల్ మండలంలోని కుప్కల్ గ్రామానికి చెందిన గాజబోయిన నవనీత గత కొంతకాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు బుధవారం ఆమె కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. వేల్పూర్‌కు చెందిన 200607 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న ఈ ఫౌండేషన్ ద్వారా సేకరించిన రూ.82,600 నగదును బాధితురాలి స్వగ్రామం కుప్కల్‌లో ఆమె భర్త సురేష్ మరియు తల్లి సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ నవనీత మెరుగైన వైద్యం చేయించుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆపదలో ఉన్న వారికి తమ వంతు సాయం అందించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. దాతల సహకారంతో బాధితురాలికి అండగా నిలవడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సేవా కార్యక్రమంలో జెల్ల రంజిత్, అంకం నరేష్, పిండి ప్రభుదాస్, శివుని సంపత్, అల్లూరి రాజ్ కుమార్, రాజారపు బాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో బోధన్ ఎస్ఐ

- **సివిల్ పంచాయితీలో లంచం తీసుకుంటూ దొరికిపోయిన వైనం**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 06 (డీడీ9 వార్త) :**



శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన పోలీస్ అధికారి సివిల్ వివాదంలో తలదూర్చి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. బోధన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న భాస్కరాచారి ఒక సివిల్ మ్యాటర్‌లో బాధితుడి నుంచి రూ.7 వేల లంచం డిమాండ్ చేశారు. బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించడంతో బుధవారం ఎస్ఐ తన కార్యాలయంలో నగదు తీసుకుంటుండగా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడి నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని, చేతులకు కెమికల్ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ రావడంతో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన అధికారే ఇలా అవినీతికి పాల్పడటం స్థానికంగా చర్చనీయాంశమైంది. లంచం తీసుకోవడం, ఇవ్వడం రెండూ శిక్షార్హమైన నేరాలని, ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచం కోసం వేధిస్తే భయపడకుండా ఫిర్యాదు చేయాలని ఏసీబీ ఉన్నతాధికారులు సూచించారు. బాధితులు ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు లేదా 9440446106 వాట్సాప్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. కేసు నమోదు చేసిన అధికారులు ఎస్ఐ భాస్కరాచారిని ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నారు.



# హేమాద్రి వేంకటేశ్వర స్వామి ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం

**కీసర, మే 6(డిడి9 వార్త):**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కీసర మండలం రాంపల్లిదాయర వెంకులోనిగుట్టలో హేమాద్రి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. టీటీడీ వేద పండితులు వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా నాలుగు రోజులపాటు కొనసాగే ఉత్సవాలకు అంకురార్పణ చేశారు.ఆలయ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డి దంపతులతో సంకల్పం చేయించి విశ్వక్సేనారాధనతో పుణ్యాహవచనం, అజస్ర దీపారాధన, ఆచార్య ఋత్విక్వరణ, మేదిని పూజ, మృత్సంగ్రహణం నిర్వహించారు. అనంతరం వాస్తు పూజ, వాస్తు హోమం, వాస్తు శుద్ధి చేపట్టారు.

స్థానికులతో పాటు పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు పూజల్లో పాల్గొని స్వామివారి దర్శనం పొందారు.

**ప్రారంభ పూజలో ఎంపీ చామల**

ప్రతిష్ట మహోత్సవాల ప్రారంభ పూజలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డి శేషవస్త్రంతో సత్కరించి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీకి పునాది వేసిన సీనియర్ నాయకులకు సముచిత గౌరవం ఇవ్వాలి

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 06(డి డి 9వార్త ):**

కాంగ్రెస్ పార్టీ అనేది దశాబ్దాల చరిత్ర కలిగిన జాతీయ ఉద్యమాల పుట్టినిల్లు. కష్టకాలంలోనూ, విజయకాలంలోనూ పార్టీ పట్ల నిబద్ధతతో పని చేసిన సీనియర్ నాయకులు ఈ పార్టీకి అసలు బలమైన పునాది రాళ్లు. ప్రభుత్వ ఏర్పాటుకాని క్లిష్ట పరిస్థితుల్లో కూడా పార్టీ జెండాను మోసి, ప్రజల మధ్య పార్టీ భావజాలాన్ని నిలబెట్టిన వారే ఈ సీనియర్లు.అయితే, ఇటీవల రాజకీయ పరిణామాల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బి ఆర్ ఎస్ లో ఉండి, కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీలోకి చేరి కేవలం వారి స్వార్థ రాజకీయాల నడిపిస్తూ వున్నా కొందరు పదవుల ఆశావాహులుగా ఉంటూ మేమే పార్టీని నడిపిస్తున్నాను అంటూ పుకార్లు చేసుకోవడం హాస్యాస్పదం. ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత పార్టీలో చేరిన నాయకులకు ప్రాధాన్యం పెరుగుతుండగా, దీర్ఘకాలంగా సేవలందించిన సీనియర్ నాయకులు పక్కన పడుతున్నారనే భావన కలుగుతోంది. ఇది పార్టీ అంతర్గత ఐక్యతకు, నిబద్ధతకు భంగం కలిగించే అంశంగా మారే ప్రమాదం ఉంది. పార్టీ హైకమాండ్ సూచించినట్లు కాంగ్రెస్ పార్టీ పదవుల కోసం కనీసం మూడు సంవత్సరాల సీనియార్టీ ప్రాతిపదికను కచ్చితంగా అమలు చేస్తే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, పదవుల కేటాయింపులో న్యాయం, పారదర్శకత, సేవల ఆధారిత గుర్తింపు ఉండాలని ముఖ్యంగా, కష్టకాలంలో పార్టీని నిలబెట్టిన సీనియర్ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వడం పార్టీ బాధ్యతగా భావించాలని . అదే సమయంలో, కొత్తగా చేరిన నాయకులను కూడా సముచితంగా వినియోగించుకోవడం అవసరం, కానీ అది సీనియర్లను నిర్లక్ష్యం చేయడం ద్వారా జరగకూడదని సీనియర్ నాయకులు కోరుతున్నారు.సీనియర్ నాయకుల అనుభవం, త్యాగం, నిబద్ధత పార్టీకి మార్గదర్శకంగా ఉంటాయి. వారి సేవలను గౌరవిస్తూ వారికి తగిన పదవులు ఇవ్వడం ద్వారా పార్టీ బలపడుతుంది, కార్యకర్తలలో నమ్మకం పెరుగుతుంది. అందువల్ల, కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఈ అంశంపై గంభీరంగా ఆలోచించి, సీనియర్ నాయకులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటుందని కోరుకుంటున్నారు.







# సాలూర సహకార సంఘం పర్సన్ ఇన్చార్జ్ చైర్మన్‌గా అల్లే జనార్ధన్ బాధ్యతల స్వీకరణ

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 06 (డీడీ9 వార్త) :**

హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా సహకార అధికారి జారీ చేసిన ఆదేశాల ప్రకారం సాలూర సహకార సంఘం పర్సన్ ఇన్చార్జ్ చైర్మన్‌గా అల్లే జనార్ధన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు పాలకవర్గ సభ్యులకు కూడా సంఘ ఇన్చార్జి బాధ్యతలను అధికారులు అప్పగించారు. అనంతరం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అల్లే జనార్ధన్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలూర సహకార సంఘం పరిధిలోని రైతుల సంక్షేమానికి, వారి సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా సాగు సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సంఘం అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేస్తూ పారదర్శక పాలన అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, సంఘం డైరెక్టర్లు, నాయకులు, సహకార శాఖ అధికారులు, రైతులు మరియు సంఘ సిబ్బంది పాల్గొన్నారు. బాధ్యతలు చేపట్టిన నూతన పాలకవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

# పిల్లల భద్రతపై...ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ

**కీసర, మే 6(డిడి9 వార్త):**

పిల్లల రక్షణకు కీలకమైన పోక్సో చట్టంపై కీసరలో విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థలో 600 మందికి పైగా ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ అందించారు. మల్కాజిగిరి సెక్యూరిటీ కౌన్సిల్, పోలీస్ కమిషనరేట్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం కమిషనర్ సుమతి ఐపీఎస్ ఆధ్వర్యంలో జరిగింది. సావిత్రి నేతృత్వంలో మహిళా షీ టీమ్స్ విభాగం అధికారులు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. పోక్సో చట్టంలోని ముఖ్య అంశాలు, 'మంచి స్పర్శ-చెడు స్పర్శ'పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద పరిస్థితులను గుర్తించడం, తగిన విధంగా స్పందించే మార్గాలపై వివరించారు. వాస్తవ ఘటనలను ఉదాహరణగా చూపిస్తూ విద్యార్థుల్లో ధైర్యం పెంపొందించారు. వేధింపులు ఎదురైనా మౌనం వహించకుండా బయటపెట్టాలని, చట్టపరమైన రక్షణ అందుబాటులో ఉందని సావిత్రి సూచించారు. కార్యక్రమానికి మేజర్ జయసుధ, లెఫ్టినెంట్ కల్నల్ సంగీత కుమారి, సుబేదార్ మేజర్ ముకేష్ కుమార్ సహకారం అందించారు. విద్యార్థుల్లో భద్రతపై అవగాహన పెంపొందించడంలో ఈ కార్యక్రమం దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు.



# కాప్రా సర్కిల్‌లో మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక పర్యటన

**కాప్రా,మే 5(డిడి9 వార్త):**

మల్కాజిగిరి మున్సిపల్ పరిపాలనలో లోపాలపై దృష్టిసారించిన కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి బుధవారం కాప్రా సర్కిల్‌లో ఆకస్మికంగా పర్యటించారు. శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, ఎంటమాలజీ, రెవెన్యూ, యూపీడీ విభాగాల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. శ్రీనివాస్ నగర్ కాలనీలో ఇంటింటి చెత్త సేకరణ, జివిపి పాయింట్ల నిర్వహణను తనిఖీ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టుపక్కల ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. శ్రీనివాస్ నగర్ పార్క్ 2లో పాతబడిన పిల్లల ఆటపరికరాలను వెంటనే మరమ్మతు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అరుణ్ కాలనీలో వివాదంలో ఉన్న కమ్యూనిటీ హాల్ సమస్యను త్వరితగతిన పరిష్కరించి నిర్మాణ పనులు ప్రారంభించాలని టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలను ఆదేశించారు. రాజరాజేశ్వరి కాలనీలో ల్యాండ్‌మార్క్ అపార్ట్మెంట్ సమీపంలోని నాలా డీసిల్టింగ్ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని చెప్పారు. వంపుగూడ డివిజన్‌లోని లక్ష్మి నగర్, వెస్టర్న్ బ్లిస్ కాలనీల్లో దోమల పెరుగుదలకు కారణమైన బ్రీడింగ్ పాయింట్లను గుర్తించారు. నిల్వ నీటిని వెంటనే తొలగించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాలనీ అసోసియేషన్‌తో మాట్లాడి మురుగు నీరు నిల్వ కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# నకిలీ స్కిన్ క్లినిక్‌లపై దాడులు నాలుగు సీజ్

**మేడ్చల్–మల్కాజిగిరి, మే 6(డిడి9 వార్త):**

జిల్లాలో అనధికారంగా నడుస్తున్న హెయిర్, స్కిన్, డెర్మాటలజీ క్లినిక్‌లపై వైద్యశాఖ కఠిన చర్యలు చేపట్టింది. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఉమా గౌరి ఆధ్వర్యంలో బుధవారం కేపీహెచ్‌బీ పరిధిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 'వావ్ మెన్ స్కిన్ & కాస్మెటిక్ హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ క్లినిక్', 'హెచ్‌సి హెయిర్ క్రియేషన్స్', 'డెర్మో 360 కాస్మెటాలజీ', 'అమిస్టా కాస్మెటాలజీ' క్లినిక్‌లు ఎటువంటి రిజిస్ట్రేషన్ లేకుండా నడుస్తున్నట్లు గుర్తించారు. అర్హత కలిగిన వైద్యులు లేకుండానే వైద్య సేవలు అందిస్తున్నట్లు తేలడంతో, సంబంధిత చట్టాల ప్రకారం నాలుగు క్లినిక్‌లను సీజ్ చేశారు. అదనంగా పేషెంట్ల నుంచి ప్యాకేజీల పేరిట ముందుగానే అధిక మొత్తాలు వసూలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్న ఇటువంటి అక్రమ క్లినిక్‌లపై నిరంతరం తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు. ఉమా గౌరి మాట్లాడుతూ.. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని, అర్హతలున్న వైద్యులే సేవలు అందించాలని హెచ్చరించారు.



## ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ షెడ్యూల్ వచ్చేసింది..
# ఫైనల్ ఎక్కడంటే..!

- **ఐపీఎల్ 2026 ఫైనల్‌కు అహ్మదాబాద్ ఆతిథ్యం ఇవ్వనున్నట్టు ప్రకటించిన బీసీసీఐ**
- **అనూహ్యంగా బెంగళూరు నుంచి అహ్మదాబాద్‌కు ఫైనల్ వేదిక మార్పు**
- **స్థానిక అధికారుల నిబంధనల వల్లే వేదిక మార్చినట్టు బీసీసీఐ వెల్లడి**
- **మే 26 నుంచి ప్లేఆఫ్స్.. ధర్మశాల, చండీగఢ్‌లలో కీలక మ్యాచ్‌లు**
- **మే 31న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో గ్రాండ్ ఫైనల్**

**డిడి9 వార్త:**
ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించిన కీలక ప్రకటన వెలువడింది. ఉత్కంఠభరితంగా సాగే ఈ టోర్నీ ప్లేఆఫ్స్ షెడ్యూల్‌ను బీసీసీఐ బుధవారం అధికారికంగా విడుదల చేసింది. ఈసారి గ్రాండ్ ఫైనల్‌కు ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం అయిన అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది. మే 31న తుదిపోరు జరగనుంది.

70 లీగ్ మ్యాచ్‌ల తర్వాత ప్రారంభమయ్యే ప్లేఆఫ్స్ పోరులో భాగంగా మే 26న ధర్మశాలలోని హెచ్‌పీసీఏ స్టేడియంలో క్వాలిఫయర్1 మ్యాచ్ జరగనుంది. ఇందులో పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్ బెర్త్ కోసం తలపడతాయి. అనంతరం మే 27న న్యూ చండీగఢ్‌లోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఎలిమినేటర్ మ్యాచ్ జరుగుతుంది. ఇందులో మూడు, నాలుగు స్థానాల్లోని జట్లు పోటీపడతాయి. క్వాలిఫయర్1లో ఓడిన జట్టు, ఎలిమినేటర్‌లో గెలిచిన జట్టు మధ్య జరిగే క్వాలిఫయర్2 మ్యాచ్ కూడా మే 29న ఇదే వేదికపై నిర్వహిస్తారు.

సాధారణంగా ఐపీఎల్ నిబంధనల ప్రకారం గత సీజన్ విజేత హోమ్ గ్రౌండ్‌లో ఫైనల్ జరుగుతుంది. ఈ లెక్కన గత ఎడిషన్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) కావడంతో ఫైనల్ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగాల్సి ఉంది. అయితే, అనూహ్యంగా బీసీసీఐ ఈ వేదికను అహ్మదాబాద్‌కు మార్చింది.

ఈ మార్పుపై బీసీసీఐ ఒక ప్రకటనలో వివరణ ఇచ్చింది. "వాస్తవానికి ఫైనల్ వేదికగా బెంగళూరును నిర్ణయించాం. అయితే, స్థానిక అసోసియేషన్, అధికారుల నుంచి వచ్చిన కొన్ని అభ్యర్థనలు, నిబంధనలు బీసీసీఐ నిర్దేశించిన మార్గదర్శకాలు, ప్రోటోకాల్స్‌కు అతీతంగా ఉన్నాయి. ఈ కారణంగానే వేదికను మార్చాల్సి వచ్చింది" అని బీసీసీఐ స్పష్టం చేసింది. అంతేగాక "నిర్వహణ, లాజిస్టికల్ అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ సీజన్‌లో ప్రత్యేక పరిస్థితుల్లో ప్లేఆఫ్స్‌ను మూడు వేదికల్లో నిర్వహిస్తున్నాం" అని కూడా తెలిపింది.

ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ షెడ్యూల్ వివరాలు:
క్వాలిఫయర్ 1: మే 26 - హెచ్‌పీసీఏ స్టేడియం, ధర్మశాల
ఎలిమినేటర్: మే 27 - న్యూ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, న్యూ చండీగఢ్
క్వాలిఫయర్ 2: మే 29 - న్యూ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, న్యూ చండీగఢ్
ఫైనల్: మే 31 - నరేంద్ర మోదీ స్టేడియం, అహ్మదాబాద్



## సంజూ కాదు.. ఆ యువ ఆటగాడి ఆట అమోఘం: బ్యాటింగ్ కోచ్ మైఖేల్ హస్సీ

**డిడి9 వార్త:**
చెన్నై సూపర్ కింగ్స్ (CSK) బ్యాటింగ్ కోచ్ మైఖేల్ హస్సీ, యువ ఆటగాడు కార్తీక్ శర్మ ప్రతిభను మరియు సంజూ శాంసన్ అనుభవాన్ని ప్రశంసించారు. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వీరిద్దరూ కలిసి 114 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పి చెన్నైకి అద్భుత విజయాన్ని అందించారు. చెన్నై జట్టు స్వల్ప లక్ష్యమైన 156 పరుగులను ఛేదించే క్రమంలో వరుసగా వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్నప్పుడు కార్తీక్ శర్మ క్రీజులోకి వచ్చాడు. ఆ సమయంలో అనుభవజ్ఞుడైన సంజూ శాంసన్ మరో ఎండ్‌లో ఉండటం కార్తీక్‌కు ఎంతో కలిసి వచ్చిందని హస్సీ అభిప్రాయపడ్డారు. శాంసన్ తన అనుభవంతో యువ ఆటగాడిని ప్రశాంతంగా ఉంచుతూ, మ్యాచ్ పరిస్థితులను వివరిస్తూ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడని ఆయన పేర్కొన్నారు. కేవలం పవర్ హిట్టింగ్ మాత్రమే కాకుండా, మ్యాచ్ పరిస్థితిని అర్థం చేసుకుని ఆడే 'గేమ్ సెన్స్' కార్తీక్ సొంతమని హస్సీ కొనియాడారు.

కార్తీక్ శర్మ 31 బంతుల్లో 41 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. వేగంగా పరుగులు చేయాలనే ఒత్తిడిలో సిక్సర్లు కొట్టడానికి ప్రయత్నించి వికెట్ పారేసుకోకుండా, చాలా పరిణతితో బ్యాటింగ్ చేశాడని కోచ్ మెచ్చుకున్నారు. రూ. 14.20 కోట్లకు అమ్ముడైన ఈ 20 ఏళ్ల యువకుడు, వరుసగా రెండో మ్యాచ్‌లో కూడా అజేయంగా నిలిచి జట్టును గెలిపించడం విశేషం. ఆధునిక క్రికెట్‌లో కేవలం బంతిని బలంగా బాదడమే కాకుండా.. క్రాఫ్ట్ , టెక్నిక్ ఉన్న ఆటగాళ్లకు ఇంకా చోటు ఉందని కార్తీక్ నిరూపించాడని హస్సీ అన్నారు. ఈ విజయంతో చెన్నై సూపర్ కింగ్స్ 5 మ్యాచుల్లో 10 పాయింట్లు సాధించి ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో కొనసాగుతోంది. సీఎస్‌కే తన తదుపరి మ్యాచ్‌లో మే 10న లక్నో సూపర్ జెయింట్స్ (LSG)తో తలపడనుంది. ఈ గెలుపు జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపింది.



# ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ రేసులో ఉత్కంఠ... ఏ జట్టు పరిస్థితి ఎలా ఉందంటే?

- **రసవత్తరంగా మారిన ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ రేసు**
- **పాయింట్ల పట్టికలో టాప్-4లో పంజాబ్, బెంగళూరు, హైదరాబాద్, రాజస్థాన్**
- **రేసులోకి బలంగా పుంజుకున్న చెన్నై సూపర్ కింగ్స్**
- **ఢిల్లీ, కోల్‌కతా, ముంబై జట్లకు ప్రతి మ్యాచ్ 'డూ ఆర్ డై'**
- **అనేక జట్ల భవిష్యత్తును నిర్ధారించనున్న నెట్ రన్ రేట్**

**డిడి9 వార్త:**
ఐపీఎల్ 2026 సీజన్ ప్లేఆఫ్స్ రేసు ఊహించని మలుపులతో అత్యంత రసవత్తరంగా మారింది. లీగ్ దశ ముగింపునకు వస్తున్నా, ఏ జట్టుకూ ఇంకా ప్లేఆఫ్స్ బెర్త్ ఖరారు కాలేదు. గణాంకాల ప్రకారం ఇంకా ఏ జట్టూ అధికారికంగా రేసు నుంచి నిష్క్రమించకపోవడంతో రాబోయే ప్రతి మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగనుంది. ముఖ్యంగా పాయింట్ల పట్టికలో జట్ల మధ్య స్వల్ప తేడాలు మాత్రమే ఉండటంతో నెట్ రన్ రేట్ (NRR) కీలకంగా మారనుంది.

**అగ్రస్థానంలో పంజాబ్, బెంగళూరు**
ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్లు పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. పంజాబ్ 13 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, బెంగళూరు 12 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఈ రెండు జట్లూ మెరుగైన నెట్ రన్ రేట్‌ను కలిగి ఉండటం వారికి కలిసొచ్చే అంశం. పంజాబ్ తన మిగిలిన 5 మ్యాచ్‌లలో 2 గెలిస్తే సులభంగా అర్హత సాధిస్తుంది. ఇక, ఆర్‌సీబీ (+1.420)కి ఉన్న భారీ నెట్ రన్ రేట్ వారి ప్రధాన బలం. వారు 23 విజయాలు సాధిస్తే ప్లేఆఫ్స్ బెర్త్ ఖాయం.

**మధ్యలో తీవ్ర పోటీ.. పుంజుకున్న చెన్నై**
సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH), రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్), గుజరాత్ టైటాన్స్ (జీటీ) జట్లు కూడా 12 పాయింట్లతో టాప్ జట్లకు గట్టి పోటీ ఇస్తున్నాయి. అయితే, ఈ మూడు జట్లు పంజాబ్, బెంగళూరు కంటే ఒక మ్యాచ్ అదనంగా ఆడాయి. హైదరాబాద్, రాజస్థాన్ పాజిటివ్ రన్ రేట్‌తో మెరుగైన స్థితిలో ఉండగా, గుజరాత్ టైటాన్స్ నెగటివ్ రన్ రేట్‌తో (0.147) ఇబ్బంది పడుతోంది. జీటీ ప్లేఆఫ్స్ చేరాలంటే రాబోయే మ్యాచ్‌లలో భారీ విజయాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

మరోవైపు, సీజన్‌ను నెమ్మదిగా ప్రారంభించిన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) చివరి నాలుగు మ్యాచ్‌లలో మూడు గెలిచి రేసులోకి బలంగా పుంజుకుంది. రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలోని ఈ జట్టు, మిగిలిన 4 మ్యాచ్‌లలో కనీసం 3 గెలవడం ద్వారా 16 పాయింట్లతో ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలని చూస్తోంది. సీఎస్‌కేకి ఉన్న పాజిటివ్ నెట్ రన్ రేట్ (+0.151) చివరి దశలో వారికి ఉపయోగపడవచ్చు.



**ఇకపై ప్రతి మ్యాచ్ కీలకమే**
ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ), కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్), ముంబై ఇండియన్స్ (ఎంఐ) జట్ల పరిస్థితి క్లిష్టంగా మారింది. ఢిల్లీకి ఇకపై ఒక్క ఓటమి కూడా వారి అవకాశాలను దెబ్బతీస్తుంది. మిగిలిన అన్ని మ్యాచ్‌లు గెలిస్తేనే వారికి అవకాశం ఉంటుంది. కోల్‌కతా, ముంబయి జట్లు కూడా దాదాపు ఇదే పరిస్థితిలో ఉన్నాయి. ఈ జట్లు మిగిలిన అన్ని మ్యాచ్‌లు గెలవడంతో పాటు ఇతర జట్ల ఫలితాలు కూడా తమకు అనుకూలంగా రావాలని కోరుకోవాలి. ఈ మూడు జట్లకు వారి నెగటివ్ నెట్ రన్ రేట్ పెద్ద అవరోధంగా మారింది. లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) అద్భుతంగా రాణించి మిగిలిన అన్ని మ్యాచ్‌లు గెలిచినా, వారి అత్యంత దారుణమైన నెట్ రన్ రేట్ (1.076) కారణంగా ప్లేఆఫ్స్ చేరడం దాదాపు అసాధ్యం. మొత్తం మీద రాబోయే రెండు వారాలు అభిమానులకు అసలైన టీ20 మజాను పంచనున్నాయి. ప్రతి పరుగు, ప్రతి వికెట్ పాయింట్ల పట్టికను, జట్ల భవిష్యత్తును మార్చే అవకాశం ఉండటంతో ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ రేసు చివరి బంతి వరకు ఉత్కంఠగా సాగడం ఖాయం.

## వైభవ్ సూర్యవంశీ వివాదం.. రాజస్తాన్ రాయల్స్ ఫ్రాంచైజీపై ఎఫ్ఐఆర్ నమోదు!

**డిడి9 వార్త:**
ఐపీఎల్ 2026 సీజన్‌లో 15 ఏళ్ల భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ దుమ్మురేపే ప్రదర్శన చేస్తున్నాడు. రాజస్తాన్ రాయల్స్ తరఫున 10 మ్యాచ్‌లలో 404 రన్స్ బాదాడు. 237కు పైగా విధ్వంసకర స్ట్రైక్ రేట్‌తో పరుగులు చేసి అందరిని ఆశ్చర్యపరుస్తున్నాడు. ఎస్ఆర్‌హెచ్‌పై 37 బంతుల్లో 103 పరుగులు చేశాడు. ప్రస్తుతం వైభవ్ ఆరెంజ్ క్యాప్ రేసులో ప్రధాన పోటీదారుగా నిలిచాడు. అయితే అద్భుత ఆటతో అలరిస్తున్న ఈ యువ సంచలనం ఇప్పుడు చట్టపరమైన చర్చలకు కేంద్రబిందువుగా మారాడు.

15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీని ఐపీఎల్‌లో ఆడిస్తున్నందుకు రాజస్తాన్ రాయల్స్ టీమ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తానని కర్ణాటకకు చెందిన సామాజిక కార్యకర్త శివకుమార్ నాయక్ హెచ్చరించాడు. రాజస్థాన్‌లో బాల కార్మిక వ్యవస్థ ఉందని ఆయన ఆరోపించారు. 15 ఏళ్ల వయసులో వైభవ్ క్రికెట్ ఆడటం మానేసి చదువుపై దృష్టి పెట్టాలని శివకుమార్ అన్నారు. 18 సంవత్సరాల లోపు ఉన్న బాలుడు ప్రొఫెషనల్ లీగ్‌లో ఆడటం చైల్డ్ లేబర్ కిందకి వస్తుందని ఆయన వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్ఆర్ ఫ్రాంచైజీపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని హెచ్చరించడం సంచలనంగా మారింది.

'వైభవ్ సూర్యవంశీకి ఇప్పుడు 15 ఏళ్లు. ఈ వయసులో పిల్లలతో ఆడుకుంటూ, చదువుకుంటూ గడపాలి. ట్రైయినింగ్, ప్రాక్టీస్, ఐపీఎల్ మ్యాచ్.. అన్ని అతడిని ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఇంత చిన్న వయసులో ఇంత స్ట్రెస్ తీసుకోవడం సరైంది కాదు. ఐపీఎల్‌లో రాణించడంతో అంతర్జాతీయ క్రికెట్ కూడా ఆడించాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇది చైల్డ్ లేబర్‌తో సమానం. ఈ వయసులో సీనియర్ ప్లేయర్లతో సమానంగా ఆడడం కరెక్ట్ కాదు. ఐపీఎల్ కారణంగా వైభవ్ 10వ తరగతి పరీక్షలు రాయలేకపోయాడు. ఫ్రెండ్స్‌తో కలిసి స్వేచ్ఛగా తిరగలేకపోతున్నాడు. క్రికెట్ సహా చదువు కూడా చాలా ముఖ్యం. అందుకే ఐపీఎల్‌లో ఆడిస్తున్నందుకు రాజస్తాన్ రాయల్స్‌పై బాలకార్మికుల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేస్తా. అయితే క్రికెట్ వర్గాల్లో మాత్రం ఈ ఆరోపణలపై భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పలువురు నిపుణులు చెబుతున్నదేమిటంటే.. క్రీడల్లో చిన్న వయస్సులోనే ప్రతిభను ప్రోత్సహించడం సాధారణమేనని, ఇది చైల్డ్ లేబర్‌గా పరిగణించడం సరైనది కాదని అంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక క్రీడాకారులు చిన్న వయస్సులోనే ప్రొఫెషనల్ స్థాయిలో ఆడిన ఉదాహరణలు ఉన్నాయి. మరోవైపు ఐపీఎల్ వంటి భారీ వేదికలో పాల్గొనడం వల్ల ఆటగాళ్లపై ఒత్తిడి పెరుగుతుందనే ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. చిన్న వయస్సులోనే ఇంతటి పోటీని ఎదుర్కోవడం వారి మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రభావం చూపవచ్చని కొందరు అభిప్రాయపడుతున్నారు.

## "పాకిస్తాన్‌తో ఆడేది లేదు".. కేంద్రం సంచలన నిర్ణయం..

**డిడి9 వార్త:**



పాకిస్తాన్‌తో క్రీడా సంబంధాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ విడుదల చేసిన తాజా సర్క్యులర్ ప్రకారం.. భారత్, పాకిస్తాన్‌ల మధ్య ద్వైపాక్షిక క్రీడా సంబంధాలపై నిషేధం కొనసాగుతుందని స్పష్టం చేసింది. దీని ప్రకారం.. భారత జట్లు పాకిస్తాన్‌లో జరిగే ద్వైపాక్షిక టోర్నమెంట్‌లలో పాల్గొనదు. ఇదే విధంగా పాకిస్తాన్ జట్లు కూడా భారత్‌లో ఇలాంటి మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉండదు.

అయితే, ఇది అంతర్జాతీయ, మల్టీనేషన్ ఈవెంట్లకు వర్తించదని చెప్పింది. దీని ప్రకారం, ఒక టోర్నమెంట్‌లో రెండు లేదా అంతకన్నా ఎక్కువ దేశాలు భాగమైతే ఈ టోర్నీలో భారత్ పాల్గొనవచ్చు. అలాగే భారత్‌లో జరిగే ఇంటర్నేషనల్ టోర్నీల్లో పాకిస్తాన్ క్రీడాకారులు పాల్గొనే అవకాశం ఉంటుంది.

ఆసియా కప్‌లో భారత్ పాల్గొనడంపై తలెత్తిన వివాదం నేపథ్యంలో, ఈ విధానాన్ని తొలిసారిగా 2025 ఆగస్టులో తీసుకువచ్చారు. 26 మంది మరణాలకు కారణమైన పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయ ఈవెంట్లలో పాల్గొనే విషయంలో సంబంధిత ప్రపంచ క్రీడా సంస్థల మార్గదర్శకాలకు, తమ అథ్లెట్ల ప్రయోజనాలకు భారత్ ప్రాధాన్యత ఇస్తుందని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. 2030 కామన్వెల్త్ గేమ్స్, 2036 ఒలింపిక్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు భారత్ పోటీలో ఉన్న సమయంలో ఈ మార్గదర్శకాలు వెలువడ్డాయి.

ఇదే సమయంలో భారతదేశాన్ని క్రీడలకు గమ్యస్థానంగా మార్చేందుకు అంతర్జాతీయ క్రీడా సంస్థల ఆటగాళ్లు, కోచ్‌లు, సాంకేతిక సిబ్బంది, అధికారుల వీసా ప్రక్రియ సులభతరం చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అంతర్జాతీయ క్రీడా సంస్థల అధికారులకు 5 ఏళ్ల వరకు మల్టిపుల్ ఎంట్రీ వీసాలను ఇవ్వనున్నట్లు ప్రకటించింది.

# అది డెడ్ బాలా?.. ఔటా?.. నితీశ్ రాణా ఔట్‌పై వివాదం!

- **విచిత్రమైన రీతిలో ఔటైన డీసీ బ్యాటర్ నితీశ్ రాణా**
- **స్వీప్ షాట్ ఆడి క్యాచ్ ఇవ్వగా.. అంతకుముందే గాలికి వికెట్ పైనున్న బెయిల్ కిందపడ్డ వైనం**
- **ఇది డెడ్ బాల్ కాదా? అంటూ సోషల్ మీడియాలో తీవ్ర చర్చ**
- **బ్యాటర్ పరధ్యానానికి గురైతేనే డెడ్ బాల్ ప్రకటించాలని చెప్పిన ఎంసీసీ రూల్స్**
- **నిబంధనల ప్రకారమే అంపైర్లు నిర్ణయం తీసుకున్నారని నిపుణుల విశ్లేషణ**




**డిడి9 వార్త:**
ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) బ్యాటర్ నితీశ్ రాణా ఔటైన తీరు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. బలమైన గాలులు వీస్తున్న పిచ్‌పై నిలకడగా ఆడుతున్నట్లు కనిపించిన రాణా, స్వీప్ షాట్ ఆడే ప్రయత్నంలో డీప్ ఫైన్ లెగ్ ఫీల్డర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అయితే, అతను క్యాచ్ ఔట్ అయ్యే క్షణానికి ముందే వికెట్ల పైనున్న ఒక బెయిల్ గాలికి కిందపడిపోయింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అసలు అది డెడ్ బాల్ కాదా అనే వాదన మొదలైంది. ఈ ఘటన జరిగిన వెంటనే చాలా మంది పలు రకాల సందేహాలు వ్యక్తం చేశారు. అది హిట్ వికెట్ కావొచ్చని కొందరు, వికెట్ కీపర్ సంజూ శాంసన్ పొరపాటున వికెట్లను కదిలించి ఉంటాడని మరికొందరు అభిప్రాయపడ్డారు. అయితే, వీడియోను క్షుణ్ణంగా పరిశీలించినప్పుడు, బ్యాటర్ గానీ, కీపర్ గానీ వికెట్లను తాకలేదని స్పష్టమైంది. స్టేడియంలో వీస్తున్న బలమైన గాలుల కారణంగానే బెయిల్ కిందపడిందని నిర్ధారణ అయింది.

**అసలు రూల్ ఏం చెబుతోంది?**
ఈ వివాదంపై మేరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) నిబంధనలు స్పష్టతనిస్తున్నాయి. ఎంసీసీ చట్టంలోని రూల్ 20.4.2.6 ప్రకారం బౌలర్ బంతిని వేసేందుకు సిద్ధమవుతున్నప్పుడు గానీ, బంతిని అందుకుంటున్న సమయంలో గానీ బ్యాటర్‌కు ఏదైనా శబ్దం లేదా కదలిక వల్ల పరధ్యానం కలిగితే అంపైర్ దానిని 'డెడ్ బాల్'గా ప్రకటించవచ్చు. కానీ, నితీశ్ రాణా విషయంలో అలా జరగలేదు. బౌలర్ బంతిని వదిలిన తర్వాత, రాణా షాట్ ఆడుతున్న సమయంలో బెయిల్ కింద పడింది. అంటే, బంతిని ఎదుర్కొనేటప్పుడు అతనికి ఎలాంటి పరధ్యానం కలగలేదు. కాబట్టి దీనిని డెడ్ బాల్‌గా ప్రకటించేందుకు నిబంధనలు అంగీకరించవు. అలాగే, బ్యాటర్ స్వయంగా వికెట్లను పడగొడితేనే దాన్ని హిట్ వికెట్‌గా పరిగణిస్తారు. ఇక్కడ గాలికి బెయిల్ పడటంతో హిట్ వికెట్ రూల్ వర్తించదు.

ఈ నేపథ్యంలో ఈ ఘటన విచిత్రంగా అనిపించినప్పటికీ, క్రికెట్ చట్టాల ప్రకారం అంపైర్లు తీసుకున్న నిర్ణయం సరైనదేనని క్రీడా నిపుణులు విశ్లేషిస్తున్నారు. మైదానంలో జరిగిన ఈ అనూహ్య సంఘటన, క్రికెట్ నియమాలపై మరోసారి విస్తృత చర్చకు తెరలేపింది.

# సల్మాన్ ఖాన్ వర్సెస్ ప్రభాస్.. 'స్పిరిట్' డేట్ ఫిక్స్.. రూమర్స్ అన్నీ తుడిచిపెట్టేసిన మేకర్స్!





యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానులు ఎప్పుడెప్పుడు రిలీజ్ అవుతుందా అని ఎదురు చూస్తున్న సినిమాలలో 'స్పిరిట్' ముందు వరుసలో ఉంటుంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఇటీవల సోషల్ మీడియా వేదికగా జోరుగా రూమర్స్ వస్తున్నాయి. ఈ చిత్రం వాయిదా పడినట్లు వస్తున్న వార్తలకు తాజాగా మేకర్స్ ఫుల్ స్టాప్ పెట్టారు. ఈ సినిమా ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారమే మార్చి 5, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుందని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ప్రముఖ ట్రేడ్ అనలిస్ట్ తరణ్ ఆదర్శ్ తన సోషల్ మీడియా ఖాతాలో ధృవీకరించారు.

**రూమర్లకు చెక్.. క్లారిటీ ఇచ్చిన టీమ్**

సల్మాన్ ఖాన్ తన కొత్త చిత్రం (SVC 63)ను 2027 ఈద్ కానుకగా విడుదల చేయబోతున్నట్లు ప్రకటించడంతో, 'స్పిరిట్' వాయిదా పడుతుందనే ప్రచారం జరిగింది. సల్మాన్‌తో పోటీ ఎందుకని సందీప్ రెడ్డి వంగా కూడా ఈ సినిమాను డిసెంబర్ 2027కు మారుస్తారనే వార్తలు వైరల్ అయ్యాయి. అయితే 'స్పిరిట్' టీమ్ మాత్రం వీటిని కొట్టిపారేసింది. ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చి 5నే సినిమా రిలీజ్ అవుతుందని స్పష్టం చేసింది.

**బాక్సాఫీస్ వద్ద భారీ యుద్ధం..**

మార్చి మొదటి వారంలోనే ఈద్ పండుగ వచ్చే అవకాశం ఉండటంతో, సల్మాన్ ఖాన్ - వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో వస్తున్న SVC 63 తో స్పిరిట్ తలపడనుంది. సాధారణంగా భారీ చిత్రాలు క్లాష్ అవ్వకుండా జాగ్రత్త పడతాయి. కానీ ప్రభాస్ సినిమా విషయంలో మేకర్స్ చాలా ధీమాగా ఉన్నారు. సందీప్ రెడ్డి వంగా గత చిత్రం 'యానిమల్' బాక్సాఫీస్ వద్ద సృష్టించిన వసూళ్ల విధ్వంసం తెలిసిందే, ఇప్పుడు అదే కాన్ఫిడెన్స్‌తో ఆయన సల్మాన్‌ను ఢీకొట్టేందుకు రెడీ అవుతున్నట్లు ఇండస్ట్రీలో జోరుగా చర్చ జరుగుతుంది. ఈ సినిమాలో ప్రభాస్ ఒక పవర్‌ఫుల్ ఐపీఎస్ ఆఫీసర్‌గా కనిపిస్తారని సమాచారం. అంతర్జాతీయ క్రైమ్ సిండికేట్‌ను మట్టుబెట్టే పోలీస్ పాత్రలో ఆయన నటన ఈ చిత్రానికే హైలైట్‌గా ఉండనుందని సినీ సర్కిల్‌లో జోరుగా ప్రచారం జరుగుతుంది. ఈ సినిమాలో త్రిప్తి దిమ్రి హీరోయిన్‌గా నటిస్తోంది.

# నాలుగు కార్లు కొన్నాను... కానీ ఇల్లు మాత్రం లేదు..



టాలీవుడ్ యువ నటుడు సుమంత్ ప్రభాస్ తాజాగా గోదారి గట్టుపైన సినిమాలో ప్రధాన పాత్రలో నటించాడు. ఈ చిత్రాన్ని మే 8న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన వరుస ఇంటర్వ్యూలలో పాల్గొంటూ ఆసక్తికర విషయాలను పంచుకుంటున్నారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం గురించి ఓపెన్ అయ్యారు. సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ... "కొంతకాలం క్రితం నేను నాలుగు కార్లు కొన్నాను అని చెప్పాను. దానికి చాలామంది మిడిల్ క్లాస్ యువకుల కల అదే అని స్పందించగా, మరికొందరు ఎందుకు చెప్పావు అని ప్రశ్నించారు" అని తెలిపారు. అయితే ఆ విషయం చెప్పడానికి ప్రధాన కారణం తన తండ్రి ఆనందమేనని ఆయన వెల్లడించారు. చిన్నప్పుడు తమ ఇంట్లో కారు లేకపోవడం వల్ల అవసరం వచ్చినప్పుడు ఇతరుల్ని అడగాల్సి వచ్చేదని, అది తన తండ్రికి ఇబ్బందిగా ఉండేదని, ఇప్పుడు నాకు అవకాశాలు వచ్చాయి. అందుకే మా నాన్నగారికి నాలుగు కార్లు కొనిచ్చాను. ఆయన చాలా సంతోషంగా ఉన్నారు. అదే సమయంలో తనకు ఇప్పటికీ సొంత ఇల్లు లేదని, ప్రస్తుతం నెలకు 8-9 వేల రెంట్ చెల్లిస్తూ జీవిస్తున్నానని తెలిపారు. ఇప్పుడున్న సినిమాల ద్వారా మంచి డబ్బు వస్తుందని భావిస్తున్నాను. త్వరలోనే ఒక ఇల్లు మా తల్లిదండ్రులకు ఇల్లు కొనిస్తాను, అప్పుడు మా వాళ్లు ఇంకా ఆనందపడతారు" అని చెప్పారు. ప్రస్తుతం ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# విజయ్ దేవరకొండ సరసన కృతిసనన్..

టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. అయితే 'హాయ్ నాన్న' ఫేమ్ శౌర్యువ్ దర్శకత్వంలో విజయ్ ఒక మైథలాజికల్ బ్యాక్‌డ్రాప్ సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. వైరా ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థ నిర్మించనున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటోంది. అయితే, ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ హీరోయిన్.. కృతీసనన్‌ను చిత్ర బృందం సంప్రదిస్తున్నట్లు ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో గట్టిగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఈ కాంబినేషన్‌కు సంబంధించి చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే దీనిపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కృతీసనన్ గతంలో మహేశ్‌బాబు 'వన్ : నేనొక్కడినే', ప్రభాస్ 'ఆది పురుష్', నాగచైతన్య 'దోచెయ్' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. కానీ ఒక్క మూవీ కూడా హిట్ అవ్వలేదు. ఒకవేళ ఈ ప్రాజెక్టు ఓకే అయితే, విజయ్ దేవరకొండ - కృతీసనన్ జోడీ వెండితెరపై ఒక ఫ్రెష్ ఫీల్‌ను తీసుకురావడం ఖాయం. కాగా ప్రస్తుతం విజయ్ 'రణబాలి', 'రౌడీ జనార్ధన' సినిమాల షూటింగ్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రాల షూటింగ్ ముగింపు దశకు చేరుకున్న తర్వాత శౌర్యువ్ దర్శకత్వంలో రాబోయే మైథలాజికల్ సినిమాను విజయ్ ఆరంభించే అవకాశం ఉంది



# లక్ష్యం సంక్రాంతే!

కథా నాయకుడు రజనీకాంత్ ఇటీవలే 'జైలర్ 2' సినిమాని ముగించారు. దీంతో ఇప్పుడు తన తదుపరి 173వ చిత్రంపై దృష్టి సారించారు. 'తలైవర్ 173' వర్కింగ్ టైటిల్‌తో పట్టాలెక్కనున్న ఈ సినిమాని కథానాయకుడు కమల్‌హాసన్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. సుందర్.సి ఈ చిత్ర దర్శకత్వ బాధ్యతల నుంచి తప్పుకున్నాక.. శిబి చక్రవర్తిని దర్శకుడిగా ఖరారు చేశారు. కానీ, ఇప్పుడాయన కూడా వ్యక్తిగత కారణాలతో ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంతో దీన్ని తెరకెక్కించే బాధ్యతను అశ్వత్ మారిముత్తు అందిపుచ్చుకున్నట్లు సమాచారం. ఈ చిత్రం ప్రకటించినప్పుడే దీన్ని పొంగల్ బరిలో దించనున్నట్లు కమల్ ప్రకటించిన విషయం తెలిసిందే.

ఇప్పుడీ ప్రాజెక్ట్‌లో దర్శకత్వ పరంగా కీలక మార్పులు జరిగినప్పటికీ పండగ లక్ష్యంలో ఏ మార్పు ఉండదని తెలుస్తోంది. దీనికి తగ్గట్లే అశ్వత్ జులై నుంచి చిత్రీకరణ ప్రారంభించి, వరుస షెడ్యూల్స్‌లో ఏడాది చివరి నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళిక రచిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ చిత్ర స్క్రిప్ట్ పనులతో పాటు పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని.. త్వరలోనే దర్శకత్వ మార్పుపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని తెలిసింది. ఇక రజనీ నటించిన 'జైలర్ 2' ఆగస్టులో థియేటర్లలోకి రానున్నట్లు సమాచారం.



# దళపతి విజయ్ కాదు.. ఇకపై 'తమిళనాడు సీఎం'

తమిళనాడు రాజకీయ చరిత్రలో అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ, తన రాజకీయ అరంగేట్రంతోనే అతిపెద్ద పార్టీగా అవతరించిన 'తమిళగ వెట్రి కళగం' (TVK) అధినేత విజయ్.. ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డు సృష్టించారు. తాజాగా థియేటర్లలో ప్రత్యక్షమైన 'జననాయగన్' చిత్రానికి సంబంధించిన కొత్త టైటిల్ కార్డ్ సోషల్ మీడియాను ఊపేస్తోంది.

**ఆ టైటిల్ కార్డ్‌లో ఏముందంటే..**

సోషల్ మీడియా వేదికగా వైరల్ అవుతున్న వీడియోల ప్రకారం.. జననాయగన్ సినిమాలో విజయ్ పేరుకు ముందు "తమిళనాడు గౌరవనీయులైన ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్" అని ప్రదర్శించారు. భారతదేశ సినీ చరిత్రలో ఒక నటుడికి 'ముఖ్యమంత్రి' అనే ట్యాగ్‌తో టైటిల్ కార్డ్ పడటం ఇదే తొలిసారి అని విజయ్ అభిమానులు గర్వంగా చెప్పుకుంటున్నారు. ఈ దృశ్యాన్ని చూసిన ఫ్యాన్స్ థియేటర్లలో పూనకాలతో ఊగిపోతున్నారు. డ్యాన్సులతో, కేకలతో సినిమా హాళ్లు హోరెత్తిపోతున్నాయి.




# 80ల నాటి విజయనగరం కోసం ఏకంగా 24 భారీ సెట్లు!

టాలీవుడ్‌లో ప్రస్తుతం ప్రకంపనలు సృష్టిస్తున్న ప్రాజెక్ట్ పెద్ది. ఈ సినిమా గురించి బయటకు వస్తున్న ఒక్కో వార్త అంచనాలను ఆకాశానికి తీసుకెళ్తోంది, తాజాగా ఈ చిత్ర ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్ల పంచుకున్న విశేషాలు సినీ వర్గాల్లో సెన్సేషన్‌గా మారాయి. 70, 80ల నాటి నెటివిటీని వెండితెరపై పునఃసృష్టి చేసేందుకు చిత్ర బృందం ఎంతలా కష్టపడుతుందో ఆయన వివరించారు. సాధారణంగా ఏదైనా పీరియడ్ డ్రామా తీయాలంటే చాలా జాగ్రత్తలు తీసుకోవాలి అందుకే 'పెద్ది' విషయంలో మేకర్స్ ఎక్కడా రాజీ పడలేదు. ఈ సినిమా ప్రపంచాన్ని నిర్మించడం కోసం కేవలం ప్రీప్రొడక్షన్ పనులకే దాదాపు ఒక సంవత్సరం పాటు సమయం కేటాయించినట్లు అవినాష్ కొల్లా వెల్లడించారు. విజయనగరం జిల్లాలోని మారుమూల పల్లెటూళ్లలో 1970 - 80ల కాలంలో ఉన్న పరిస్థితులను కళ్లకు కట్టేలా చూపించడమే ఈ సినిమా ప్రధాన లక్ష్యం.

ఈ చిత్రానికి సంబంధించి అత్యంత ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. సినిమా కోసం ఏకంగా 24 భారీ సెట్లను రూపొందించారు. ఆ కాలం నాటి ఇళ్లు, వీధులు, వాతావరణం ప్రతిబింబించేలా ఈ సెట్లను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దారు. నేటి ఆధునిక కాలంలో ఆ పాత తరం నాటి 'రస్టిక్' లుక్‌ను తీసుకురావడం ఒక సవాల్‌గా అనిపించినా, విజువల్స్‌లో ఆ మ్యాజిక్ ఖచ్చితంగా కనిపిస్తుందని చిత్ర బృందం ధీమాగా ఉంది. విజయనగరం మట్టి వాసన, అక్కడి యాస, ఆ కాలం నాటి సామాజిక పరిస్థితుల నేపథ్యంలో సాగే ఈ కథ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందనడంలో సందేహం లేదు. ఆర్ట్ డైరెక్షన్ పరంగా అవినాష్ కొల్లా తీసుకున్న జాగ్రత్తలు, ఆ 24 భారీ సెట్లు సినిమా స్థాయిని ఎక్కడికో తీసుకెళ్తాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.




# స్టార్ హీరో సరసన లక్కీ చాన్స్ కొట్టే-



టాలీవుడ్ యంగ్ అండ్ ప్రామిసింగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే తన అదృష్టాన్ని పరీక్షించుకునే దశలో ఉంది. తెలుగులో రవితేజ సరసన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో భారీ ఆశలతో అడుగుపెట్టినప్పటికీ, ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. దీంతో ఈ అమ్మడికి టాలీవుడ్‌లో మొదటి ప్రయత్నంలో నిరాశే ఎదురైంది. అయితే, పట్టువదలని విక్రమార్కుడిలా ఇప్పుడు కోలీవుడ్‌లో తన అదృష్టాన్ని వెతుక్కుంటోంది. భాగ్యశ్రీ బోర్సేకు తమిళ చిత్ర పరిశ్రమలో ఒక బంపర్ ఆఫర్ దక్కింది. కోలీవుడ్ స్టార్ హీరో శివకార్తికేయన్ సరసన హీరోయిన్‌గా నటించే అవకాశాన్ని ఆమె దక్కించుకుంది. నేడు భాగ్యశ్రీ బోర్సే పుట్టినరోజు సందర్భంగా, ఆమె నటిస్తున్న 'సెయాన్' చిత్రబృందం ఒక సర్ప్రైజ్ అప్‌డేట్‌ను అందించింది. ఈ సినిమాలోని భాగ్యశ్రీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేయగా, అది ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో భాగ్యశ్రీ లుక్ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. బ్లూ కలర్ చుడిదార్ ధరించి, నుదుట కుంకుమ, జడలో మల్లెపూలతో అచ్చమైన కేరళ అమ్మాయిలా ఆమె మెరిసిపోతోంది. అయితే, ముఖంలో మాత్రం తీవ్రమైన కోపం కనిపిస్తోంది. చేతిలో ఒక పెద్ద నెమలి ఈకను పట్టుకుని ఎవరినో హెచ్చరిస్తున్నట్లుగా ఉన్న ఆమె చూపులు సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రస్తుతం ఈ లుక్ నెటిజన్లను షాక్‌కు గురి చేస్తుండగా.. మరికొందరు ఫిదా అయిపోతున్నారు. శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని లెజెండరీ యాక్టర్ కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 2026లో ఒక గ్రాండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా, మాస్ ఎలిమెంట్స్, ఎమోషన్స్‌తో ఈ సినిమా రాబోతోంది. కోలీవుడ్‌లో బిజీగా ఉంటూనే, తెలుగులో తన రెండో ప్రయత్నంగా అక్కినేని అఖిల్ సరసన 'లెనిన్' చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. జూన్ 26న విడుదల కానున్న ఈ చిత్రంపై భాగ్యశ్రీ భారీ ఆశలే పెట్టుకుంది. అటు స్టార్ హీరో శివకార్తికేయన్, ఇటు యంగ్ హీరో అఖిల్.. సినిమాలతో ఈ ఏడాది భాగ్యశ్రీ బోర్సే కెరీర్ మలుపు తిరుగుతుందో లేదో చూడాలి.